హేతువాదమంటే ?

ఎం. వి. రామమూర్తి

ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్
హైదరాబాదు

Bharat-P.
3rd May'2011

హేతువాదమంటే...?

[ప్రశ్నలు - జవాబులు]

T. N. A. DHANA RAO
VIJAYAWADA.
11-3-1981

ఎం. వి. రామమూర్తి

ప్రజాస్వామ్య ప్రచురణాలు (ప్రై) లిమిటెడ్.,
హైదరాబాదు.

00-4
బుక్ సెంటర్

ప్రజాస్వామ్య ప్రచురణలు - 4

హేతువాదమంటే ... ?

ఎం. వి. రామమూర్తి

ప్రథమ ముద్రణ : సెప్టెంబరు 1979

ప్రతులు : 1000

పబ్లిషర్సు :

ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్,

హైదరాబాదు, తెనాలి.

సోల్ డిస్ట్రిబ్యూటర్సు :

సరళా పబ్లికేషన్స్
తెనాలి

ముద్రణ :

శ్రీ సీతారామ్ ప్రెస్, తెనాలి.

వెల రు. 4-00

స్వ వి ష యం

"ప్రజాస్వామ్య ప్రచురణలు" ఒక వినూత్న ప్రయత్నం. ఇతర సంస్థలతో రూపసామ్యం వున్నా ఆదర్శాలలో, లక్ష్యసాధనా విధానాలలో, కార్యాచరణ రీతులలో భిన్నమైనది.

వ్యక్తి జీవితంలో, సమాజ జీవితంలో అన్ని రంగాలలో ప్రజాస్వామ్యం వెల్లివిరిసి మూడు పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లాలని ఈ సంస్థ అభిమతం, ఆశయం కూడాను.

ఇలాంటి ప్రయత్నాలు పూర్వం జరిగినవి. ప్రస్తుతం జరుగుచున్నవి. కాని వానికీ, మా యీ ప్రయత్నానికీ తారతమ్యమున్నది. ఉదాత్తమయిన ఆశయాలతో, ఉత్తేజం పొందిన మేధావుల సమిష్టి సహకార కృషి ఫలితంగా యీ సంస్థ ఉద్భవించినది.

విశ్వజనీయతే దీని విశిష్టత. మొత్తం మానవ ప్రపంచ సంస్కృతీ, సాహిత్యాలు దీని వారసత్వం. ముఖ్యంగా భారతదేశ సంస్కృతిలో ఇంతవరకు మరుగున పడిన మాణిక్యాలు - చార్వాక, కపిల, కణాదుల మతాలు, సిద్ధాంతాలు దీని సొమ్ము. తెలుగుదేశమే కాదు, తెలుగు భాష విస్తరించిన ప్రాంతమంతా దీని కార్య క్షేత్రము.

ప్రపంచంలో విప్లవాలు ఎక్కడ వచ్చినా, ఏ కాలమందు జరిగినా అవన్నీ దీనికి అధ్యయన యోగ్యాలే. ఇంగ్లండులో 1689 లో బ్రిటిషు రాచరికానికి పరిమితులు, హద్దులు విధించిన విప్లవం; అమెరికాలో 1776 లో ప్రాతినిధ్యాధికార మున్నవారే పన్నులు విధించగల హక్కుదారులని 'ప్రజాస్వామ్య' సూత్రాన్ని ఎలుగెత్తి చాటిన విప్లవం; 1789 లో స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వము ఆదర్శాలుగా విజయవంతమయిన ఫ్రెంచి విప్లవం; 1917 లో 'భూమి, తిండి, శాంతి' నినాదాలతో కార్మికవర్గం, మధ్యతరగతి రష్యాలో సాధించిన విప్లవం; 1947 లో భారతదేశం పొందిన స్వాతంత్ర్యం; 1949 లో కర్షక బలంతో చైనాలో జరిగిన విప్లవం మొదలయిన చరిత్రాత్మక సంఘటనలను లోతుగా, సునిశితంగా, సమ్యక్ దృష్టితో పరిశీలించి తదనుగుణమైన ప్రచురణలు చేయాలని ఈ సంస్థ ఆదర్శం.

సామాజిక పరివర్తనకూ, భావగమనానికీ అవినాభావ సంబంధ మున్నదనే విషయం జగద్విదితం. అయితే భావాలు ప్రాతిభాసికాలేనా లేక మానవ మస్తిష్క-

ములో ఉదయించిన తరుణం నుంచీ ప్రత్యేక గమన సూత్రాలతో స్వతంత్ర లక్షణాలు కలిగి పెంపొందుచున్నవా ? రెండవ స్వరూపం అవశ్య పరిగ్రహణ యోగ్యం. ఈ సూత్రాన్ని విశ్వవిఖ్యాత విప్లవవాది, మేధావి అయిన యమ్. యన్. రాయ్ 1946 లో ప్రవచించాడు. ఈ భావన యీ సంస్థకు జీవగర్ర.

వ్యక్తివాదం, హేతువాదం, మానవవాదం ఈ సంస్థను భాసించే త్రికము (త్రిగుణాలు). మానవులంతా ఒకటే; మానవ సమాజానికి మూలము మానవుడే; మానవుని అభ్యున్నతియే మానవ సమాజ అభ్యుదయానికి, శ్రేయస్సుకు కొలమానం లేక వరుమానం; ప్రకృతి నియమ బద్ధమైనది కనుక ప్రకృతినుంచి ఉద్భవించిన మానవుడు కూడా వస్తుతః నియమబద్ధుడు అంటే హేతువాది. కనుక అతడు నీతివంతునిగా మనగలడని ప్రకటించిన రాడికల్ హ్యూమనిజం యొక్క తాత్విక సిద్ధాంతం ఈ సంస్థకు పెలుగు బాటగా అడుగడుగునా ప్రభావితం చేస్తుంది.

మానవ వాదం యీనాటిది కాదు. మానవజాతి సహజంగా మనుగడ సాగించి నప్పటినుంచీ యీ తాత్విక చింతన జరుగుతూనే వచ్చినది. కాని ఆధునిక యుగంలో మానవ విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందటంతో ప్రస్తుతం నూతన భాష్యాలతో, విస్మృత విషయ పరిజ్ఞానంతో ఆ పాతకాలపు మానవ వాదాన్ని పరిశీలించి సవరించి, పునరుద్ధరించవలసిన అవసర మేర్పడినది. ఆ కృషి ఫలితమే యమ్. యన్. రాయ్ నవ్యమానవ వాదం.

స్వేచ్ఛాపిపాస, సత్యాన్వేషణ మానవ మనుగడ ప్రేరకాలని పేర్కొనటం ఈ నవ్యమానవవాద విశిష్టత. (1) అంతరాత్మ ప్రేరిత నీతి లేక దైవ నిర్దేశిత నీతి; (2) ప్రయోజనాత్మక నీతి; అనే రెంటికీ ప్రత్యామ్నాయంగా హేతుబద్ధమయిన నీతిని చాటిచెప్పినది. రాజకీయ రంగంలో పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని ప్రతిపాదించినది. ఆర్థిక రంగంలో సహకార సంబంధమయిన ప్రణాళికా రచనలను రూపొందించినది. సాంస్కృతిక రంగంలో భావ స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించినది. సాంఘికంగా కుల, మత, వర్గ, లింగ, ప్రాంతీయ, భాష, జాతి, దేశ విభేదాలను నిరసించినది. విశ్వజనీయ సంస్కృతికి పిలుపు నిచ్చినది. ఏకత్వంలో భిన్నత్వాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడ గల్గినది. అంధ విశ్వాసాలకు గొడ్డలిపెట్టు. ప్రబోధ కార్యక్రమాలను బలపరుస్తుంది. అందులో ఒక భాగమే ఈ సంస్థ ప్రచురణ యత్నం.

ఈ ప్రకృతికి అతీతమయిన మరే యితర శక్తి లేదని తెలుసుకొనటం: తన మనుగడకు, భవిష్యత్తుకు తానే బాధ్యుడ నని గుర్తెరగటం: తన క్షేమానికి, అభ్యున్నతికీ, తోటి మానవుల శ్రేయస్సుకూ వైరుధ్యం లేదనే విషయాన్ని గ్రహించి సమాజ స్థితిగతులను మెరుగు పరచటానికి ఉద్యుక్తుడు కావటం ఉత్తమ మానవ లక్షణం.

ఈ మానవవాద లక్ష్యాలనే 1952లో నెలకొల్పబడిన అంతర్జాతీయ హ్యూమనిస్టు నైతిక సంఘం మరోరూపంలో ప్రకటించినది. భారత రాడికల్ హ్యూమనిస్టు సంఘాన్ని ఆ ప్రపంచ సంస్థ గుర్తించి పూర్తి సభ్యత్వాన్నిచ్చినది. ఆ అంతర్జాతీయ సంఘం ఐదు ఖండాలలోని అనేక దేశాలలో అనుబంధ సంస్థలు కలిగి అసమాన మైన కృషి సాగిస్తున్నది.

ప్రస్తుతం ప్రపంచ మానవాళి సాంస్కృతికంగా విషమ స్థితిలో చిక్కుకొని యున్నది. ఒక వైపు మత ప్రాబల్యాలు, మరోవైపు ఫాసిజం, కమ్యూనిజం లాంటి నియంతృత్వ విధానాలు చలామణి అవుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రజల ఆశయా లను నెరవేర్చకపోగా హీనస్థితికి దిగజార్చు చున్నవి. దీని ఫలితంగా తృతీయ మార్గ న్వేషణ ప్రారంభ మయినది. విజ్ఞానం పెరుగుదల, మానవ మేధస్సు, సృజనాశక్తి అభివృద్ధి చెందడంతో నూతన తాత్విక చింతనలకు ప్రాతిపదిక ఏర్పడినది.

దీనినే నైతికంగా హ్యూమనిజం అని పిలువటం కూడా కద్దు. ఇది ప్రజా స్వామ్య సూత్రానికి కట్టుబడి వున్నది. ప్రతివ్యక్తి సాధ్యమైనంతగా వికాసం పొంద టానికి హక్కు కలిగియున్నాడు. కేవలం ప్రభుత్వ పరిధిలోనేగాక జీవిత సంబంధా లన్నింటిలోనూ ఈ ప్రజాస్వామ్య సూత్రం వర్తిస్తుంది. విజ్ఞానాన్ని మానవ వినాశ నానికి కాక క్షేమానికి, శ్రేయస్సుకు, నిర్మాణయుతంగా వినియోగించటం ఈ సిద్ధాంతపు ఆదర్శ ముఖ్యలక్షణాలలో ఒకటి. విజ్ఞానము లక్ష్యాలను నిర్దేశించదు. మానవ శ్రేయస్సును సాధించటానికి అనువైన మార్గాలను సూచిస్తుంది.

హ్యూమనిజం నైతిక దృక్పథం కలది. మానవుని హుందాతనాన్ని సాధ్య మైనంతలో ప్రతి వ్యక్తి ఇతోధికంగా ఇతరుల హక్కులకు భంగం కలుగని రీతిగా స్వయంగా వికాసాన్ని పొందగల హక్కును గుర్తిస్తుంది. సామర్థ్యం, క్రమశిక్షణ పేరుతో మానవ జీవితాన్ని యాంత్రికం చేసే వ్యవస్థను వ్యతిరేకిస్తుంది. యాంత్రీకరణ మానవ విలువలను వమ్ము చేస్తుంది. తాత్కాలిక లక్ష్యాలను సాధించే ప్రయత్నంలో

సమగ్ర నియంతృత్వ సిద్ధాంతాలు అమలుపరచ జూచే సమగ్ర యాంత్రీకరణ త్రోసి రాజంటుంది. సమాజం యెడ బాధ్యతతో సమ్మిళితమైన వ్యక్తి స్వేచ్ఛను లక్ష్యంగా స్వీకరిస్తుంది. భౌతిక అవసరాలను తీర్చటం, భౌతిక పరిస్థితులను మెరుగుపరచటం అనే పేరుతో పైన పేర్కొనబడిన వ్యక్తి స్వేచ్ఛను త్యజించ నిచ్చగించదు. మానసిక స్వేచ్ఛ, మౌలికచింతన లేనప్పుడు అభ్యుదయం అసాధ్యం.

పిడివాదాన్ని, పిడివాదపు సిద్ధాంతాన్ని త్రోసిరాజని హ్యూమనిజం స్వేచ్ఛను ప్రబోధిస్తుంది. నైతిక విలువలను, సృజనా శక్తులతో సమ్మిళితమైన జీవిత విధానాన్ని, వ్యక్తివికాసాన్ని లక్ష్యంగా అంగీకరిస్తుంది. మారుచున్న సమాజానికి అనుగుణంగా అభ్యుదయ పథంలో అనుసరించదగిన మౌలిక జీవిత సూత్రం యిది.

విజ్ఞానాన్ని ప్రపంచ శాంతి కొరకు వినియోగించ గలిగితే ప్రస్తుత విషమ స్థితినుంచి మానవాళి విముక్తి చెందగలదు. భయవిముక్తుడయిన మానవుని పరిపూర్ణ వికాసానికి పరిమితు లుండకూడదు. ఈ తాత్విక ఆలోచనారీతి మానవ ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొనే సవాలుకు సరియైన జవాబుగా భావించ వచ్చును.

ఇలాంటి తాత్విక ధోరణి స్వేచ్ఛా భావుకతను పోషిస్తుంది. కనుక అన్ని సామాజిక రంగాలలోను వినూత్నమయిన రీతిలో స్వేచ్ఛను పెంపొందించి అభ్యుదయ మార్గాన అడుగులు వేయించగల నూతన భావాన్వేషణమే "ప్రజాస్వామ్య ప్రచురణల సంస్థ" ధ్యేయం.

అట్టి భావాలను ప్రజాబాహుళ్యానికి ఎరుక పరచటం ఈ సంస్థ ప్రథమ కర్తవ్యంగా భావిస్తుంది. ఇది సాహసమే కావచ్చు. ప్రమాదభరితం కూడా కావచ్చును. కాని లక్ష్యసాధన కొరకు చేసే యిట్టి కృషిని విస్మరించజాలము. ఈ ప్రయత్నానికి, వ్యాపారానికి స్వేచ్ఛాపిపాసకల వ్యక్తులందరి సానుభూతి, సహకారాలను అర్థిస్తున్నాము.

ఎం. వి. రామమూర్తి
అధ్యక్షుడు
బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్
ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్

9. M. I. G. H కాలనీ
మెహదీ పట్నం
హైదరాబాద్.

పాఠకులకు

హేతువాదం గురించి స్థూలంగా తెలియచెప్పు నావశ్యకత హేతువాద సంఘాలపై నున్న ప్రస్తుత తరుణంలో నన్ను ప్రోత్సహించి నాచే యీ చిన్ని పొత్తమును వ్రాయించిన శ్రీమతి మల్లాది వెంకటసుబ్బమ్మకూ, ప్రాతప్రతిని చదివి అమూల్యమైన సలహాలిచ్చిన సర్వశ్రీ రావిపూడి వెంకటాద్రి, కొల్లా సుబ్బారావు లకు నా ధన్యవాదములు.

ఇది సమగ్రం మాత్రం కాదు. హేతువాదంలో అవసరమైన, ఆసక్తి దాయకమైన కొన్ని విషయాలను మాత్రమే స్పృశించటం జరిగినది. రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాలను హేతువాద దృష్టితో ఎలా విశ్లేషించి విమర్శించాలి; విద్యారంగంలో, సాహితీ-సంస్కృతులలో హేతువాదపు ప్రభావం ఎలా వుండాలి; సాధారణ ప్రజానీకపు దైనందిన సమస్యల పరిష్కారంలో హేతుత్వ విధానం ఎంతగా అనుసరణీయము; సామాజిక విప్లవం సాధించటానికి హేతుయుతమైన ఆందోళనలు, పోరాటాలు ఎలా వుండాలి; మొత్తం మానవ ప్రపంచానికి ఒకే విధమైన రాజ్యాంగ వ్యవస్థను స్థాపించటం ఎంతవరకు సహేతుకము అనే విషయాలు ఇందులో వివరించలేదు. అందుకు వేరే ఉద్గ్రంథ మవసర మున్నది.

ఈ రచనలో ఎక్కడయినా లోటుపాట్లు దొర్లితే అవి నావిగానే భావించ గలను. ఆవేశాలకు, ఉద్రేకాలకు లోనుకాని పద్ధతిలో నా యీ రచన సాగించానని నా నమ్మకం. ఇందలి బాగోగులను, ప్రయోజనాన్ని నిర్ణయించవలసినది చదువరులే.

ఎం. వి. రామమూర్తి

హైదరాబాదు.

ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్.,

స భ్యు లు

శ్రీ ఎం. వి. రామమూర్తి

శ్రీ కోగంటి రాధాకృష్ణమూర్తి

శ్రీ గుంటుపల్లి గోపాలరావు

శ్రీమతి మల్లాది వెంకటసుబ్బమ్మ

శ్రీ గురిజాల సీతారామయ్య

శ్రీ కొల్లా సుబ్బారావు

విషయసూచిక

పేజీ

1. హేతువాదం, తాత్విక చింతన, శాస్త్రీయ దృక్పథం 9

2. హేతువాదం – సామాజికపరమైన భావనలు 28

3. హేతువాదం – జీవిత రీతులు 44

4. హేతువాదం – సాంఘిక సంస్కరణలు, సామాజిక విప్లవం 52

5. హేతువాదం – ఇతర సిద్ధాంతాలు 53

6. హేతువాద ఉద్యమం 64

7. హేతువాదులకు ఒక కార్యక్రమం 66

హేతువాదం, తాత్వికచింతన, శాస్త్రీయ దృక్పథం

1. మానవుడు హేతువాదికాడు; కేవలం వాసనా ప్రేరితుడు మాత్రమే. మీ అభిప్రాయం ?

ఇది అసత్యము; నిత్య అనుభవానికి విరుద్ధము. వ్యక్తులు ఆలోచించి నిర్ణయాలు చేయటం మనము గమనిస్తున్నాము. హిందూ మత సిద్ధాంతములో కూడ పురుష ప్రయత్నానికి ఆస్కార మున్నది. కనుక మానవునికి వ్యక్తిగతంగా ఆలోచనాశక్తి, ఊహాశక్తి, సమన్వయశక్తి ఆదిగా గలవి లేవని వాదించటం వితండవాదము. మానవుని ప్రత్యేకతను గమనించక, జంతువుతో సమానంగా భావించి ఆతని హేతుత్వ శక్తికంటె వాసనలు, ప్రేరణలు బలీయమని వాదించుట ఒక పద్ధతి. అసలు మానవునిలో హేతుత్వం లేదనుట మరోపద్ధతి. వితండవాదులు వీనా రెండో పద్ధతిని బలపరచే వారు బహు అరుదుగా వుంటారు.

2. హేతువాదానికి తాత్విక ప్రాతిపదిక వున్నదా ?

ఉన్నది. ప్రకృతిని, మానవ జీవితాన్ని విడమరచి చెప్పగల వివిధ శాస్త్రపరిజ్ఞానాన్ని, కళల సారాంశాన్ని క్రమబద్ధం చేసి వడి దుడుకులు లేని మానవ జీవితాన్ని చూపటమే తాత్విక చింతన (Philosophy). తాత్విక దృక్పథం అనవసరం అనేవారు కూడా వున్నారు. కాని అలా వాదించేవారి పద్ధతికూడ ఒక రకమయిన తాత్వికవాదమే.

హేతువాదం మానవునిలోని హేతుత్వంపై ఆధారపడుతుంది. కార్యకారణ నియమాన్ని గ్రహించుట, ఆలోచించుట, ఊహ

ఆధారాల ప్రాతిపదికతో ఊహించుట, పొందిన జ్ఞానాన్ని భద్ర పరచుకొని అవసరమైనప్పుడు వినియోగించుకొనుట మొదలయిన వన్నీ హేతుత్వం యొక్క లక్షణాలు.

3. మానవునిలో హేతుత్వం వుండటానికి కారణం ?

దీనికి అనేక రకాల సమాధానాలు రాబట్టవచ్చును.

(i) బ్రహ్మాండమయిన పరమాత్మలోని ఒక కణం మానవ శరీరంలో జీవాత్మగా ప్రవేశిస్తున్నది లేక ఉంటున్నది. అదే హేతుత్వానికి మూలము.

(ii) మానవుడు దైవాంశసంభూతుడు. దేవుడు మానవుని తన రూపంలో సృష్టించాడు. కనుక హేతుత్వం మానవుని ప్రత్యేకమయిన, విలక్షణమయిన శక్తి. అది మానవునిలోని దైవస్వరూపము.

(iii) జగత్తు నియమబద్ధము; కార్యకారణ సంబంధము కల్గి యున్నది. అది మానవుని స్థాయిలో హేతుత్వంగా పరిణమించినది.

(iv) జగత్తులో నియమ మున్నమాట వాస్తవమే. కార్యకారణ సూత్రము (Law of causality) కూడ జగత్తులో కన్పట్టుట సత్యమే. కాని మానవునిలోని హేతుత్వం జగత్తులోని కార్యకారణ సూత్రము వలన కలిగినదని చెప్పటానికి ఆధారాలు మాత్రం లేవు.

(v) కార్యకారణ సంబంధం మానవ జీవితంలో కూడ అమలులో వుంటున్నది. మానవునిలో హేతుత్వం వున్నది. అది ఎలా వచ్చినదో చెప్పజాలను. అది అనవసరం కూడాను. కాని అది మానవుని విశిష్ట లక్షణం

ఇందులోని మొదటి సమాధానం-జగత్తుకు లోపల, బయట బ్రహ్మాండమయిన శక్తివున్నదని విశ్వసించేవారిది. జగత్తుకు

వెలుపల అతీతమయిన శక్తి వున్నదనుటకు తగిన సాక్ష్యాలు, నిదర్శనాలు లేవు. కనుక ఆ సమాధానం అంగీకరించ రానిది.

దేవుడు జగత్తును సృష్టిచేశాడని నమ్మే వివిధ మతస్థులు రెండవ సమాధానాన్ని చూపుతారు. దేవుని ఉనికికి వాస్తవిక ప్రతిపదిక లేనపుడు ఇది సంతృప్తికరమయిన సమాధానం కాజాలదు.

యం. యన్. రాయ్ మూడవ సమాధానాన్ని ప్రతిపాదించాడు. ఈ వాదన రెండు భాగాలు. ఒకటి-ప్రకృతిలో కార్యకారణ నియమ మున్నది. మానవునిలో హేతుత్వశక్తి కదే మూలకారణం అనేది రెండవది. మార్పు ప్రకృతి లక్షణం. ఆ మార్పు కొన్ని నియమ నిబంధనల ననుసరించి జరుగుచున్నది. ఇది మన అనుభవంలోని విషయం.

నిప్పు ఎలా మండుతుంది? నీరు ఎలా ప్రవహిస్తుంది? అను ప్రశ్నలనుండి యంత్రాలు ఎలా పనిచేస్తున్నవి? చంద్రునిపైకి, అంతరిక్షంలోనికి రాకెట్ల సహాయంతో మానవుడు ఎలా ప్రయాణం చేయగలుగుచున్నాడు? అనే ప్రశ్నలవరకు సమాధానాలు రాబట్టగలిగితే జగత్తులో కార్యకారణ సంబంధం కన్పడుతుంది. పరిణామ క్రమం ప్రస్ఫుటమౌతుంది.

జగత్తులో భాగమే మానవుడు. కాగా పశు, పక్ష్యాదులను మించిన ప్రత్యేకజాతి (Species) గా అవతరించాడు. మనుగడకు వాసనాప్రేరణను అధిగమించి పనిముట్లు చేయగల నేర్పును, భాషను, ముందు తరాలవారికి తన నాగరికతను, సంస్కృతిని అందజేయగల శక్తిని, సృజనాపాటవాన్ని ఆతడు అలవరచుకున్నాడు. మానవుని లోని హేతుత్వ ప్రతిభయే దీనికి మూలకారణం. జగత్తులోని కార్యకారణ నియమసూత్రమే మానవునిలో హేతుత్వంగా పరిణమించినది.

దేవుడు, ప్రకృతికి అతీతమయినశక్తి మొదలయిన వానిలో నమ్మకం లేనివారుకూడ నాల్గవ సమాధానాన్ని చేపట్టు చున్నారు. భారత దేశంలో సుప్రసిద్ధ లౌకికవాది, సెక్యులరు సొసైటీ అధ్యక్షుడు ఎ. బి. షా ఈ కోవకు చెందినవాడు. పరిణామ సూత్రాన్ని అంగీకరిస్తాడు. కాని పరిణామ క్రమంలో మానవునిలో హేతుత్వశక్తి ఉద్భవించలేదని వాదిస్తాడు. నిదర్శనలు లేవని అంటాడు. మానవుడు ఏ విషయాన్నయినా పరిశీలించేటప్పుడు రెంటిపై ఆధారపడతాడు. ఒకటి అనుభవం. రెండవది తర్కము. మానవ మేధస్సు పనిచేసే తీరులోని క్రమమే తర్కానికి దారి తీసినది. తార్కిక పద్ధతి నవలంబిస్తే ఎ. బి. షా లాంటివారి సమాధానం సంతృప్తికరంగా వుండదు.

ఐదవ సమాధానం బండగా, మొండిగా చెప్పేపద్ధతి. జిజ్ఞాసకు వ్యతిరేకం. కనుక ఆమోదయోగ్యం కాదు.

4. కార్యకారణ సంబంధం అంటే ఏమిటి ?

ఒక సంఘటన (Event) జరిగినపుడు దానికి కారణా లుంటవి. ఇక్కడ సంఘటనను కార్యముగా పేరొకొనవచ్చును. ఒక సంఘటన మరొక సంఘటనకు దోహదపడవచ్చును. అపుడు మొదటి సంఘటన కారణము; రెండవది కార్యము. ప్రతి కార్యానికి కనీసము ఒక కారణ ముంటుంది. ప్రతి కార్యము మరో కార్యానికి కారణ మవు తుంది. అయితే ప్రతి కార్యానికి ఒకే ఒక కారణమే వుండక పోవచ్చును. అనేక కారణా లుండవచ్చును. కాని కారణము లేని కార్యము మాత్రము ఉండదు. ప్రతి కార్యము ఎప్పుడో ఒకప్పుడు వెనువెంటనే లేక సుదీర్ఘ కాలంలో మరో కార్యానికి కారణభూత మవుతుంది. అదేవిధంగా కారణం కార్యమవుతుంది.

యాదృచ్ఛిక లేక కాకతాళీయ సంఘటన (Accident) కు కారణాలుంటాయా అనే ప్రశ్న ఉదయించవచ్చును. అసలు ప్రకృతిలోను, మానవ జీవితంలోను యాదృచ్ఛిక సంఘటనలకు చోటులేదని వాదిస్తూ యాంత్రికంగా ఆలోచించేవాడుకూడ లేకపోలేదు. కాని అనుభవంలో యాదృచ్ఛిక సంఘటనలను గమనిస్తున్నాము. యాదృచ్ఛిక సంఘటన అంటే మానవ జీవితంలో ముందుగా ఊహించకుండా జరిగే సంఘటన.

(1) పెండ్లిలగ్నం నిశ్చయ మవుతుంది. వధూవరులు పెండ్లి పీటలపై కూర్చుంటారు. కాని పెండ్లి ఆగిపోతుంది. అదే లగ్నానికి ఆ వధూవరులలో ఒకరికి మరో నూతన వ్యక్తితో పెండ్లి జరిగిపోతుంది. (2) బాల్యస్నేహితులు ఇద్దరు వేరయి, దూరప్రాంతాల్లో నివసిస్తూ, ఒకరినొకరు మరచిపోయి 3, 4 దశాబ్దా లనంతరం ఎక్కడో ఏదో ఒక పట్టణ వీధిలో, పాపులో లేక హోటలులో కలుసుకుంటారు. (3) విమానం బయలుదేరేముందు ఇంజను వగైరాలన్నీ కూలంకషంగా పరీక్షింపబడి ఎగరటానికి అనుమతి నీయబడుతుంది. ఎగిరిన ఒకటి, రెండు నిముషాలకే ఆకాశంలో మంటలకు గురి అయి ఆ విమానం కూలిపోయి అందలి ప్రయాణీకులు దుర్మరణానికి గురి అవుతారు. కొందరు ప్రాణంతో బయటపడనూ వచ్చును. (4) లాటరీలో లక్షరూపాయలు గెలుపొందిన వ్యక్తి తన టిక్కెట్టును పోగొట్టుకుంటాడు. లేక పేకాట, గుర్రపు పందాలలో ఒకడు వేల రూపాయలు ఆర్జించవచ్చును లేక పోగొట్టుకొనవచ్చును. ఇలాంటివన్నీ యాదృచ్ఛిక సంఘటనలే. కాని కారణాలు ఉండకపోవు. కనుక యాదృచ్ఛిక సంఘటనలు కార్యకారణ నియమాన్ని త్రోసిరాజనవు, బలహీనపరచవు.

5. హేతువాదానికి శాస్త్రీయ దృక్పథానికి గల సంబంధ మేమిటి ?

శాస్త్రం (Science) మానవునికి అనేకవిధాల ఉపకరిస్తుంది. శాస్త్రంద్వారా మానవుడు అనేక విషయాలు తెలుసుకొనగల్గుచున్నాడు. భౌతిక పరిస్థితులు, రసాయన స్థితిగతులు, భౌగోళిక రహస్యాలు, పశుపక్ష్యాదుల ఉత్పత్తి, జీవరహస్యం, పరిణామం, మెదడు, మనస్సు ఇలా ఒకటేమిటి భౌతిక ప్రపంచంలోని అన్ని విషయాలు శాస్త్రానికి పరిశీలనార్హాలే. వీటిని శాస్త్రం అధ్యయనం చేస్తుంది. శాస్త్రజ్ఞానాన్ని మానవ శ్రేయస్సుకు వినియోగించటం శాస్త్రజ్ఞుల అభిమతం.

శాస్త్రం పనిచేసే తీరు ప్రత్యేకము, విలక్షణము. అట్టి ఆలోచనా పద్ధతిని శాస్త్రీయ దృక్పథం అంటాము. శాస్త్రభావ సరళిని శాస్త్రీయభావన (Scientific Spirit or temper) గా పేర్కొన వచ్చును.

శాస్త్రం ఎలా పనిచేస్తుంది ?— ఉన్న విషయ పరిజ్ఞానాన్ని ప్రాతిపదికగా ఎంపిక చేసుకొని క్రొత్త విషయాలను తెలుసుకొనటానికి ప్రయత్నిస్తుంది. శాస్త్రజ్ఞుడు తాను కోరుకొనే దానిని ముందుగా ప్రశ్నారూపంలో చిత్రించుకుంటాడు. ఆ ప్రశ్న సమాధానానికి అవకాశం కలిగివుంటుంది. అంతవరకు తెలుసుకొనిన జ్ఞానానికి వ్యతిరేకంగా వుండదు. ప్రశ్నకు సమాధానంగా శాస్త్రజ్ఞుడు ఒక ఊహాధారాన్ని (Hypothesis) ఏర్పరచుకుంటాడు. ఆ ఆధారంతో ప్రయోగం (Experiment) చేస్తాడు; లేక అనుభవంతో తరచిచూస్తాడు. తన ప్రయోగ ఫలితము లేక అనుభవసారము ఊహాధారాన్ని బలపరిస్తే దానిని ఆమోదిస్తాడు. ఆ ఊహాధారము ఒక వాస్తవిక విషయముగా పరిగణించబడుతుంది. లేక విఫలమైనచో

మరో ఊహాధారాన్ని ఎంపిక చేసుకుంటాడు. శాస్త్రపరిశోధనలు ఈ విధంగా సాగుతూవుంటవి. ఇందులో మరికొన్ని నియమాలు కూడా పాటింపబడాలి. శాస్త్రము ఏ ఒక్కరికో, ముఠాకో, వర్గానికో చెందిన విషయజ్ఞానం కారాదు. శాస్త్రఫలితాలు అందరికీ, ముఖ్యంగా ప్రపంచ శాస్త్రజ్ఞులందరికీ తెలియాలి. వారు వాటిని పరిశీలించాలి. వారి ప్రయోగశాలల్లో (Laboratories) కూడ అట్టి ప్రయోగాలు చేస్తే ఆ ఫలితమే రావాలి. అంటే ఒకరి శాస్త్రసత్యము ఇతర శాస్త్రజ్ఞుల ప్రయోగము వలన కూడ ఋజువు కావాలి. అప్పుడే అది అందరి ఆమోదయోగ్యం కాగలదు.

శాస్త్రజ్ఞానం ప్రజల సమ్మతిపై ఆధారపడదు. ఓటింగుకు అవకాశంలేదు. ప్రయోగం, పరిశీలన, నిర్ధారణద్వారా శాస్త్రజ్ఞుల ఆమోదం పొందాలి. అప్పటివరకు ఏ శాస్త్రజ్ఞుడు కనుగొనిన విషయానికి కూడ శాస్త్రసత్యపు హోదా లభించదు. అట్టి హోదా పొందిన శాస్త్రసత్యం ఏ ఒక వర్గానికి, జాతికి, మతానికి లోనుగాక విశ్వజనీనత కలిగి వుంటుంది. అది మొత్తం మానవ ప్రపంచానికి చెందినహక్కు, ఆస్తిగా రూపొందాలి.

శాస్త్రంలో అనుకరించే పద్ధతిని శాస్త్రీయపద్ధతి అని, దృక్పథాన్ని శాస్త్రీయ దృక్పథమని, శాస్త్రాన్ని, శాస్త్ర పరిశోధనలను ప్రోద్బలంచేసే భావాన్ని శాస్త్రీయభావన అని అంటాము.

మానవ జీవితంలో శాస్త్రీయ పద్ధతి, దృక్పథం, భావన ఎంతైనా అవసరం. అందుకు హేతుత్వం ముఖ్యాంగంగా పనిచేస్తుంది. కాని శాస్త్ర సమ్మతంకాని హేతువాదం పిడివాదంగా మారుతుంది.

6. మానవ జీవితంలో సంకల్ప (Will) మున్నది. అతనిలో ప్రేరణలు (Urges – Drives), వాసనలు (Instincts), ఉద్వేగాలు (Passions) కూడ వున్నవి. హేతుత్వాని (Reason) కి, వాటికి గల సంబంధ మేమిటి ?

ఇది చాల పెద్దప్రశ్న, చిక్కుప్రశ్నకూడాను. కనుక జాగ్రత్తగా పరిశీలించాలి.

పరిణామక్రమంలో సాగిపోతూవున్న భౌతిక జగత్తులో మానవ ఆవిర్భావ మేర్పడినది. స్థూలంగా వానరజాతిని మానవజాతికి పూర్వీకులుగా భావించవచ్చును. వానరజాతి జంతుజాతికి సంబంధించినదిం కనుక మానవునిలో జంతు స్వభావము, వాసనలు కూడ వున్నవిం అలాగే ఆకలి, సెక్సు మొదలయిన అనేక బలవత్తరమయిన ప్రేరణలకు కూడ ఆతడు లోనవుచున్నాడు. అంతకుమించి కోపము, సంతోషము, చిరాకు, విసుగు ఆదిగాగల మానసిక ఉద్వేగాలకు గురి అవుచున్నాడు. వేదాంతులు వీటినే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములని నిర్వచనం చేసారు.

మానవుడు అనుక్షణం ఏదో ఒక కార్యం చేస్తూ ఉంటాడు. ఆలోచించటం కూడా ఒక పనియే. ఆలోచనను మానివేయటం కూడ ఒక పనిగా భావించవచ్చును. ఇట్టి మానవుడు తనకు తెలిసి, తెలియక ఒక కార్యాన్ని, కార్యాచరణను ఎంపిక చేసుకుంటాడు. ఈ ఎంపిక (Choice) చేసుకోనటం అనుక్షణం జరుగుతూ వుంటుంది. ఇందులో రెండు లక్షణాలు - ఒకటి తాత్కాలికము, రెండవది దీర్ఘ కాలికమై దూరదృష్టితో చేయబడినవిగా కన్పడవచ్చును. ఇందుకు లక్ష్యాలుకూడ వుంటవి. ఈ లక్ష్యాలను (Objectives) సాధించటానికి మానవుడు తపనచెందుతాడు. నిర్విరామ కృషి సాగిస్తాడు.

ఈ లక్ష్యాలను మానవుడు ఎలా నిర్ణయించుకుంటాడు అనేది ప్రశ్న. ప్రతి విషయాన్ని బాగా ఆలోచించి, మధించి నిర్ణయాలు చేస్తాడా? లేక కేవలం ఉద్రేకాలపై ఆధారపడి నిర్ణయించుకుంటాడా? ఇక్కడే ప్రేరణలకు, ఉద్వేగాలకు, హేతుత్వానికి సంబంధ మేర్పడుతుంది.

మానవులు రకరకాల స్థాయిలో సంచరిస్తారు. అది వారి వ్యక్తిగత విషయ పరిజ్ఞానంమీద ఆధారపడివుంటుంది. అంతరంగము లేక మనస్సాక్షి (Conscience) పై ఆధారపడి నిర్ణయాలు చేసుకొనే వారు ఒకరకం. విషయ పరిజ్ఞానాన్నిబట్టి అంతరంగము పనిచేస్తుంది. అట్టి జ్ఞానం లోపభూయిష్టమై, తగినంతగా లేక అల్పమైనప్పుడు నిర్ణయాలు పొరపాటుగాక తప్పవు.

ఉదాహరణకు 'దొంగతనం' తీసుకుందాము. దొంగతనాన్ని సమాజం ఎలా పరిగణిస్తున్నది? దొంగతనంలో పట్టువడితే న్యాయస్థానం విధించే శిక్ష, శిక్షాకాలంలో అనుభవించే కష్టాలు— దొంగతనం చేయకపోయినా జీవితంలో ఎదురగుచున్న కష్ట, నష్టాలు— ఈ రెంటినీ మదింపు చేసుకొని 'దొంగతనం' వలన తన సమస్యలు, తన కుటుంబ సమస్యలు తీరగలవా, లేదా మొదలగునవి పరిగణనలోనికి తీసుకొనక పోవటంవలన 'దొంగతనం చేయాలి' అనే నిర్ణయం ఏర్పడుతుంది. తన అంతరంగము పనిచేసే తీరు ఆ వ్యక్తికి తెలిసి వుండక పోవచ్చును. కాని అది తనపని తాను చేస్తూనే వుంటుంది.

ఇక ప్రేరణలు. ఆకలి వేస్తున్నది. శరీర పోషణకు ఆహారం అవసరం. అది లభించనప్పుడు వ్యక్తి చిరాకుపడతాడు. తన స్థితికి తాను ఏవగించుకుంటాడు. సమాజంపై కోపగించుకుంటాడు. ఆహారము సంపాదించాలనే నిర్ణయానికి వచ్చి అందుకు ఉద్యమిస్తాడు. తన యీ కృషి తనతోబాటు, తన కుటుంబ సభ్యులు, గ్రామ, పట్టణ, జాతి, దేశమల్లల నధిగమించి మొత్తం మానవాళికి ఉపకరించాలని అభిలషిస్తాడు. అందుకొరకు అన్వేషణ సాగిస్తాడు. ఆతడు అవలంబించే పద్ధతి ఆతని జ్ఞానసంచయముపై నాధారపడివుంటుంది. ఈ విధంగా లక్ష్యాలు నిర్దేశితమవుతూవుంటవి. ఒక్కోసారి మానవుడు ఆలోచించకుండా నిర్ణయాలు చేసినట్లు కన్పడవచ్చును. నిజానికి ఆలోచిస్తాడు.

కాని అన్ని విషయాలు తెలుసుకొనగల పరిజ్ఞానము లేనప్పుడు పొరపాటు నిర్ణయాలు చేయవచ్చును. లేక కేవలం అంతర్ప్రవృత్తి (Intuition) నాధారం చేసుకొని నిర్ణయించవచ్చును. దీనినే మతస్థులు అంతర్వాణి లేక దైవవాణిగా పేర్కొనటంకూడా కద్దు. ఇది సత్యదూరం.

మనకు ఉన్న అనుభవసహాయంతో ఒక్కోసారి వెంటనే తుదినిర్ణయానికి రాగలము. అనుభవము మదింపుకాబడి అంతర్ప్రవృత్తిగా చలామణి అవుతుంది. ఉదాహరణకు ఒక వైద్యుని తీసుకొందాము. రోగిని పరీక్షించిన పల్లెటూరి వైద్యుడు మలేరియా లేక కైఫాయిడ్ అని చెప్పవచ్చును. ఆతనికి ప్రయోగశాల సౌకర్యాలు మాత్రము లేవు. అయినా తన అనుభవసారాన్ని మదింపు చేసుకొని దానిపై ఆధారపడి రోగి లక్షణాలు నిర్ణయిస్తాడు. తరువాత ప్రయోగశాలలో చేసిన రక్తపరీక్ష, ఇతర పరీక్షలవలన అది సత్యమని రుజువు కావచ్చును.

కనుక నిర్ణయాలు చేయటంలో హేతుత్వం ప్రత్యక్షంగా లేక పరోక్షంగా పనిచేస్తుంది. హేతుత్వం ఉద్వేగాలను అదుపులో పెట్టి క్రమబద్ధం చేస్తుందంటారు కొందరు. నిర్ణయం హేతుత్వ ప్రభావం వలన జరిగితే దానిని సాధించటానికి ఉద్వేగం ఉపకరిస్తుంది. ఉద్వేగం నిర్ణయించే లక్ష్యాలను సాధించటానికి హేతుత్వం ఉపయోగకారి. కాని లక్ష్యాలను నిర్దేశించేశక్తి హేతుత్వానికి లేదంటారు. ఇది పొరపాటు. ఆ లక్ష్యాలనే మానవుడు ఎందుకు ఎంపిక చేసుకుంటాడు? అని బ్రిటిష్ హ్యూమనిస్టు హెూల్డర్ హటన్ ప్రశ్నించాడు.

సంకల్పము కూడా కార్యకారణ నియమబద్ధమైనదే. సంకల్పము (will) లేనిది ఏపని చేయలేము. కాని సంకల్పానికి, ఉద్వేగానికి వ్యతిరిక్తత లేదు. రెండూ జీవసంభూత లక్షణాలే. ఉద్వేగం రెండు రకాలుగా పనిచేస్తుంది. హేతుత్వాన్ని జతపరచుకొని

సంకల్పానికి దారి తీస్తుంది. సంకల్ప సాధనకు ఉద్వేగం అవసరం కూడా. కనుక హేతువాదానికి, ఉద్వేగానికి వున్న సన్నిహిత సంబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

7. హేతువాదం డార్విన్ పరిణామ వాదాన్ని అంగీకరిస్తుందా?

అంగీకరిస్తుంది. డార్విన్ కనుగొనిన పరిణామసూత్రం శాస్త్ర సత్యపు హోదాను పొందినది. శాస్త్రజ్ఞులు దానిని ఆమోదించారు. పరిసరాలకు అనుగుణంగా స్పందించి సర్దుకు పోగల జాతులు మనుగడ సాగించ గలిగినవి. మిగిలినవి కాలగర్భంలో కలిసిపోయినై. సత్తాగల జాతులు బ్రతకగల్గుచున్నవని (might is right) చెప్పటం పెడధోరణికి దారి తీసినది. డార్విన్ సిద్ధాంతాన్ని జాతి దురహంకారానికి ముడి పెట్టటం పొసగనిది. ఆర్యజాతి గొప్పతనాన్ని ఈ సూత్రంద్వారా హిట్లరు, ఆతని అనుయాయులు, ఫాసిస్టులు బుజువు చేయాలని తాపత్రయ పడ్డారు. రెండవ ప్రపంచయుద్ధం జరిగినది. కాని వారి కుతంత్రాలు సాగలేదు. వారి కుహనా సిద్ధాంతాలు కూలి పోయాయి.

సంకల్ప బలంవలన మాత్రమే జాతులు వికసించలేదు. పరిణామ క్రమంలో మానవజాతి ఆవిర్భవముదాకా ప్రయోజనం కనబడదు. జీవం వివిధ మార్గాలలో విస్తరించి పయనించినది. ఆ గమనంలో పరిస్థితులకు తట్టుకొన గలిగిన జాతులు మనగల్గినవి. మానవుని మనుగడ భిన్నమైనది. తన శారీరక కృషితో, బుద్ధిబలంతో, సృజనా శక్తితో పరిసరాలను తనకు అనుకూలంగా మార్చటానికి ప్రయత్నిస్తున్నాడు. పరిణామవాదాన్ని త్రోసి రాజనటం ఈనాటి శాస్త్రీయ జ్ఞానాన్ని కాదనటమే.

8. హేతువాదం భావగమనానికి ఎంతవరకు ప్రాధాన్యత నిస్తుంది?

మానవుడు బుద్ధిజీవి. ఆతని మెదడులోని నరముల సంచలనము వలన భావోత్పత్తి కలుగుచున్నది. తనచుట్టూవున్న పరిసరాలకు మానవుడు స్పందించుట, ఏక ఇంద్రియప్రేరణ (చూచుట, వినుట, తాకుట, రుచి చూచుట, ఆఘ్రాణించుట) చెందుటవలన భావోత్పత్తి జరుగుతుందంటారు. కాని మానవునిలో ఒక ప్రత్యేకశక్తి వున్నది. అదే ఊహించగలశక్తి (Imagination). ఊహాలోకంలో మానవుడు విహరించగలడు. తనచుట్టూ వున్న ప్రపంచముతో ప్రత్యక్ష సంబంధములేని ఊహలను రూపొందించుకొనగలడు. తన సృజనాశక్తితో వాటికి ఉనికి కల్పించగలడు. తనలోని తార్కికశక్తిని వినియోగించి ప్రపంచపు నకకు రూపకల్పన చేయగలడు. ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు ఐన్‌స్టీను ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంత మిట్టిరూప కల్పనయే. జీవితానుభవం ఆ సిద్ధాంత సత్యాన్ని బుజువు చేసినది. మానవునికి ఊహాశక్తి, తార్కికశక్తి వున్నవి. వాటి సహాయంతో పాతభావాలనుండి క్రొత్తభావాలను సృష్టించగలడు.

కొందరి అభిప్రాయం ప్రకారం భావప్రపంచం పూర్తిగా సామాజిక ప్రపంచంపై ఆధారపడుతుంది. అంటే సామాజిక, భావ ప్రపంచాలకు ఎప్పుడూ ప్రత్యక్ష కార్యకారణ సంబంధం వుంటుంది. కార్‌ల్ మార్క్సు సిద్ధాంతం ప్రకారం భావప్రపంచం ఒక భవనం లోని పై అంతస్తులు మాత్రమే. సామాజిక ప్రపంచం ఆర్థిక నియతి వాదంపై ఆధారపడి వుంటుంది. అంటే సమాజంలోని ఉత్పత్తి సాధనాల స్థాయిని, శక్తులతీరును, సంబంధాల వైనాన్ని బట్టి వుంటుంది. కనుక భావప్రపంచం అంతిమంగా సమాజపు ఉత్పత్తి సాధనాలపై ఆధారపడి వుంటుందని మార్క్సు సిద్ధాంతీకరించాడు.

సంప్రదాయ మార్క్సిస్టుల ఆలోచనలో భావప్రపంచం సరాసరి ప్రత్యక్షంగా ఉత్పత్తి సంబంధాలపై ఆధారపడుతుంది. కాగా నయా మార్క్సిస్టుల దృష్టిలో ఆ సంబంధం అంత యాంత్రికం కాదు. కాని ఇరువురి దృష్టిలో భావప్రపంచం సామాజిక ప్రపంచానికి మూలమైన ఉత్పత్తి సంబంధాలు మారలేదు. ఇది మానవుని భావనాశక్తిని తక్కువగా అంచనా వేయటం, హేతుత్వశక్తిని అనుమానించటం, సృజనాశక్తిలో విశ్వాసం లేకపోవటం అని గమనించాలి. చరిత్ర అంటే కేవలం సంఘటనల (Events) యొక్క చరిత్ర మాత్రమే కాదు. భావాల చరిత్రకూడ మానవ చరిత్రలోని భాగమే. అంతేకాదు ముఖ్యమైన భాగంకూడాను. మెదడు ఉత్పత్తి సాధనాలను మించి అంతకంటే బలవత్తరమయిన విప్లవ భావాలను సృష్టించగలదు.

ఆర్థికశక్తుల ప్రాబల్యాన్ని ఎవరూ శంకించనవసరంలేదు. వాటి బలాన్ని ఎవరూ తక్కువగా అంచనా వేయరాదు. కాని భావాల బలిమిని మాత్రం నిర్లక్ష్యం చేయరాదు. భావాలను, ఉత్పత్తి శక్తులను నిర్దేశించే ఆర్థిక సూత్రాలు రెంటినీ సమ్యక్ దృష్టితో చూడగలగాలి. అప్పుడే సమాజ చరిత్ర సరిగా అవగాహన అవుతుంది.

ఉత్పత్తి సాధనాలను, సంబంధాలను మార్చితే అప్పటి వరకు సమాజ ఉపరితలంలో చలామణి అవుచున్న నీతి సూత్రాలు, ధర్మ చట్టాలు, సాహితీ సంస్కృతులు పాటంతటవే మారగలవని సంప్రదాయ మార్క్సిస్టుల అంచనా, కాని అది అనుభవానికి దూరం. సృజనాత్మక మార్క్సిస్టుగా గణుతి కెక్కిన మావో చైనాదేశంలో 'సాంస్కృతిక విప్లవం' ప్రారంభించాడు. కాని సమాజ ఉపరితలం మారలేదు. సంప్రదాయ మార్క్సిస్టులు మావోను ఆత్మాశ్రయ భావవాది (Subjective idealist) గా చిత్రించారు. అది పొరపాటు.

ఏది ఏమైనా భావాల బరిమిని గ్రహించక తప్పదు. భావాలు ఒకసారి ఉద్భవించిన తరువాత వాటి గమనం వాటికి వుండనే వుంటుంది. భావ గమనంలో ఒకస్థాయికి చేరిన భావం సమాజపు వుత్పత్తి సంబంధాలపై ప్రభావం కల్గివుంటుంది. అలాగే వుత్పత్తి సంబంధాలు, వుత్పత్తి శక్తులు భావాలపై తమ ప్రభావాన్నిచూపగలవు. అంటే ఒక దానిపై నొకటి ప్రభావం చూపుతూ ఒక దాని నొకటి మార్చగల సత్తాకలిగి వుంటవి. కాని ఈ రెంటికీ ప్రత్యేకించి ఏదశలోనూ ప్రత్యక్షమయిన కార్యకారణ సంబంధం నిర్ణయించటానికి వీలులేదు. వుదాహరణకు- ప్రబంధ కవిత్వాన్ని జమీందారీ కవిత్వంగాను; భావకవిత్వాన్ని పెట్టుబడిదారీ కవిత్వంగాను, అభ్యుదయ కవిత్వాన్ని ప్రోలిటేరియన్ కవిత్వంగాను విడగొట్టి పేర్కొనటం సబబుకాదు. పొరపాటు కూడాను.

9. హేతువాదానికి, మానవ వాదానికి కల సంబంధం ఏమిటి ?

హేతువాదు లందరూ మానవవాదులు కారు. అలాగే మానవవాదులందరూ హేతువాదులు కారు.

హేతుత్వశక్తిని గుర్తించగలిగిన వారంతా హేతువాదులే. హేతుత్వముపై ఆధారపడి జీవితాన్ని సాగించుకునే వారంతా హేతువాదులే.

మానవ శ్రేయస్సును తమ శ్రేయస్సుగానే భావించి మానవుని కొలబద్ద లేక కొలమానంగా అంగీకరించే వారంతా మానవవాదులు. కాని క్రీస్తు, గాంధి, రామకృష్ణపరమహంస, వివేకానందుడు ఆదిగాగల వారు మత మానవవాదులుగా ఒక ప్రత్యేక తెగకు చెందినవారుగా గుర్తించాలి.

'మనమంతా దేవుని బిడ్డలము లేక మనలో దైవాంశము నడిపిస్తున్నది, అనేభావము వారి మానవ వాదానికి పునాదిరాయి. మానవునిలోని హేతుత్వాశక్తిని వారు అతీతశక్తి లేక దైవాంశంగా వర్ణిస్తారు. కనుక వారిని శిసలైన హేతువాదులుగా పరిగణించటానికి వీలులేదు. మానవుని గురించి ఏమాత్రం పట్టించుకొనక, మానవ శ్రేయస్సును నిర్లక్ష్యం చేస్తూ కేవలం తమ ఊహా ప్రపంచంలో విహరిస్తూ మానవ వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను వమ్ముచేయగల మార్గాలను అన్వేషించే హేతువాదులుకూడ పోలేకపోలేదు. వుదాహరణకు అట్టోవారు వ్యక్తి అభ్యున్నతి కొరకు ముందుగా సమాజ శ్రేయస్సు జరగాలంటారు. సమాజం సమర్థవంతంగా నిర్వహింపబడటంలోనే వ్యక్తి అభ్యున్నతి ఇమిడి వుందంటారు. కాని వారు అనుసరించే విధానంలో, పద్ధతి (Methodology) లో వ్యక్తినే మరచిపోతారు. వ్యక్తిని ఒక పెద్ద యంత్రంలోని పనిముట్టుగా, శీలగా భావిస్తారు. వీరు మానవవాదులుగా ప్రచారం చేసుకుంటూ మానవ వాదాన్ని భంగపరిచే నిరంకుశ వాదులు మాత్రమే.

10. శిసలైన మానవవాది (Humanist) అంటే ఎవరు ?

స్థూలంగా చెప్పుకుంటే ఈక్రింది సూత్రాలలో నమ్మకమున్న వ్యక్తిని మానవవాదిగా పరిగణించవచ్చును.

(i) పరిణామ క్రమంలో ప్రకృతిలో భాగంగా విలక్షణమైన శక్తులు గల జీవిగా మానవుడు వుద్భవించాడు. ఆతని పుట్టుకకు పైవశక్తి కారణభూతం కాదు.

(ii) మానవునికి ఒకే జీవితమున్నది. అదైనా యీ ప్రపంచంలోనే. మరోలోకంలో జన్మగాని, జీవితంగాని లేవు.

(iii) మానవుడు తన చర్యలకు తాను బాధ్యత వహిస్తాడు.

(iv) తనచుట్టూవున్న వారి శ్రేయస్సు కొరకు పాటుబడతాడు. వారి జీవితాలను మెరుగుపరచటానికి కృషిచేస్తాడు. బాధ్యత స్వీకరిస్తాడు.

ఇటీవల మానవవాదం, మానవతావాదం అనేపదాలను సమానార్థకాలుగా వాడుచున్నారు. ఇది కొంత గందరగోళానికి దారితీసినది. మానవ వాదమంటే హ్యూమనిజమని (Humanism) మానవతా వాదమంటే దయాళుత్వము లేక కారుణ్య దృక్పథము (Humanitarianism) అని చెప్పుకోవాలి. పదాలకు అర్థాలున్నవి. కనుక స్పష్టత అవసరం. మానవవాదం అంటే ఏమిటో చెప్పుకున్నాము. అన్ని జీవజాతులయెడ దయాదాక్షిణ్యాలు చూపటం, సానుభూతిని ప్రదర్శించటం, సహాయ పడటం మానవతావాది లక్షణం. మానవవాది కూడ మానవతా వాదియే కాని అంతటితో అగడు. మానవ వ్యక్తిత్వ వికాసం కొరకు మానవాళి సంక్షేమం కొరకు అవిరళకృషి సాగిస్తాడు.

11. శిసలైన హేతువాది ఎవరు ?

మానవునిలోని హేతుత్వాన్ని ఆతని విశిష్టతగా పరిగణిస్తాడు. అది ఆతని వ్యక్తిత్వ వికాసానికి స్వేచ్ఛకు దోహద పడుతుందని భావిస్తాడు. ఆ లక్ష్యసాధనలో అతడు జరిపే సత్యాన్వేషణకు ఆ హేతుత్వం శక్తినీ, ప్రేరణను కలిగిస్తుందని భావిస్తాడు. వాస్తవానికి విరుద్ధంగా మానవుని సర్వశక్తిమంతునిగాను లేక ప్రేరణలు, ఉద్వేగాలకు బానిసగాను ఊహించడు. మానవుడు ప్రకృతి శక్తులను అన్నింటిని వెంటనే అదుపులోనికి తీసుకొని రాలేకపోవు చున్నాడని అంగీకరిస్తాడు. కాని వాటిని అదుపుచేయగల స్థితి లేక ప్రకృతిలో జరుగుచున్న ప్రమాదాలు వుపద్రవాలనుండి మానవాళి తప్పించు కొనగలుగు స్థితి లేక అట్టి ప్రమాదాల వుధృతాన్ని ముందుగా

తెలుసుకొని తనతోబాటు తనచుట్టూవున్న ప్రకృతి సమాజం అందరూ మానవుని మొదట్లో బంధాలలో వుంచుతాయని, అంతేగాక ఆతను మానసికంగాకూడ బంధాలలో వుంటున్నాడని తెలుసుకొని అట్టి బంధాల నుండి మానవ విముక్తి కొరకు కృషిచేసేవాడు శిసల్తైన హేతువాది. అలాకాకుండా "నేను సర్వస్వతంత్రుణ్ణి అనిభావిస్తే సర్వస్వతంత్రుడను కాగలను" అని అనుకోవటం పొరపాటు. అలా భావించక పోవటం బానిస ప్రవృత్తి అని ఆ బానిస భావం తొలగితే ఒక్కసారిగా మానవుడు స్వేచ్ఛాజీవి కాగలడని భావించటం కేవలం ఊహా లోకంలో విహరించటమే అవుతుంది.

మానవుని నడిపించేవి ఆతని ప్రేరణలు, ఉద్వేగాలు అని తలంచేవారుగాని లేక మానవుడు కర్మసిద్ధాంతానికి కట్టువడి వుండి ఆతని ప్రారబ్ధం (అతడు పూర్వజన్మలో చేసిన పాపఫలితం) అతనిని ఈ జన్మలోకూడ వెన్నాడుతుందని చెప్పేవారుగాని లేక మానవుని జీవితాన్ని నిర్ణయించేది మూలికంగా ఆర్థిక శక్తుల గమనమని ప్రకటించి తదనుగుణంగా నడచుకునేవారు శిసల్తైన హేతువాదులు కారు. అట్టివారు మానవుని హేతుశక్తిని ప్రేరణలు, ఉద్వేగాలకు లేక కర్మసిద్ధాంతానికి లేక ఆర్థిక శక్తుల ప్రాభవానికి బానిసగా చేస్తున్నారు.

12. హేతువాదం దుర్బలం అంటారు. మీరేమంటారు?

ఇది పొరపాటు. 19 వ శతాబ్దంలో శాస్త్రజ్ఞానానికి, 20 వ శతాబ్దంలో శాస్త్రం సంపాదించిన జ్ఞానానికి ఎంతో తేడా వున్నది.

మానవుడు నూతన విషయాలెన్నో కనుగొన్నాడు. జడపదార్థం నుండి చేతన (జీవ) పదార్థం ఎలా ఉద్భవించినదో తెలుసుకున్నాడు. ప్రేరణలు, ఉద్వేగాల గురించి అశేషమయిన జ్ఞాన సముపార్జన చేయగలిగాడు. జీవశాస్త్రం, మానసిక శాస్త్రం మినుమిట్లాలి అభివృద్ధి చెందినవి.

19 వ శతాబ్దపు హేతువాదం కొన్ని చిక్కు ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయినది. మానవునిలో హేతుత్వం ఎలా ఉద్భవించినది లేక దాని పునికికి ఆధారాలేమిటి అనే ప్రశ్నలకు సరియైన జవాబులు లేవు. జడరూపంలోవున్నా, చేతనావస్థలోవున్నా అది భౌతికమే అను జ్ఞానం ఆనాటి హేతువాదులకు లేదు. కనుక పదార్థానికి, మనస్సుకు వైరుధ్యం కల్పించుకున్నారు. ఈనాడు యీ వైరుధ్యత తొలగినది. మానసిక శాస్త్ర పరిశోధనల వలన ఈ విషయం స్పష్టంగా విశదమయినది.

మెదడు శరీరంలో భాగంగా భౌతికమైనది; మెదడు లేకుండా మనస్సుకు అస్తిత్వంలేదు; మెదడు పనిచేయటమే మనస్సుగా చెప్పుకుంటున్నాము అని నరాలు, మానసిక శాస్త్రాల్ని అవలోడనం చేసిన వారు చెప్పుచున్నారు. కాని కొంత అభిప్రాయభేదము లేకపోలేదు. మెదడు పనిచేయడమే మనస్సు అని ఒక కోవకు చెందిన వారి వాదమయితే మనస్సు యొక్క పునికిని ఇంకా స్పష్టంగా గుర్తించలేకుండా వున్నాము కాని మెదడు ఇచ్చేశక్తివలననే మనస్సు పని చేయగలుగుచున్నదని మరి కొందరి అభిప్రాయం. కాని మెదడు మనస్సుకు గల సంబంధంగురించి ఈ యిరు తెగలవారు మెదడు యొక్క ప్రాముఖ్యతను, ప్రప్రథమస్థానాన్ని అంగీకరించారు. కనుక మనస్సుకూడా భౌతికమే అవుతుంది. 19 వ శతాబ్దపు మీమాంసను అధిగమించి ఈనాడు హేతువాదంగట్టి పునాదిపై నిలబడినది.

అంతేకాదు ఈజ్ఞాన సముపార్జన భౌతిక వాదులకు బలం చేకూర్చినది. జడ, చేతనములు వేరుగా భావించే ఆధ్యాత్మిక వాదులను పట్టికొట్టించినది. కాబట్టి హేతువాదం దుర్బల మనటం సమంజసము కాదు.

ప్రకృతి పరిణామ సూత్రాలను, సమాజ పరిణామ సూత్రాలను సంపూర్ణంగా వివరించటంలో హేతువాదం విఫలమయిందని అంతకంటె గతి తార్కిక వాదం బలీయము, గొప్పదని భావించే కొందరు మార్క్సిస్టులు తమ వాదనలో లొసుగులున్నవని గ్రహించి కూడ చివరవరకు లాగితే తమకు మార్క్సిజంలో గల విశ్వాసం వమ్ము కాగలదనే భయంతో హేతువాదం దుర్బలమనే వాదనను లేవదీసారు.

గతి తార్కిక భౌతిక వాదాన్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోవాలంటే ఆసిద్ధాంతంపై వ్రాయబడిన పూర్వాపర గ్రంథాలను తప్పక పఠించాలి. గతి తార్కిక సూత్రాలు తర్కానికి, అనుభవానికి నిలబడవు. ఆ సిద్ధాంతంలోని త్రికం అంటే మూడు సూత్రాలు సత్యదూరాలు

13. హేతువాదం లోప భూయిష్టం విూరేమంటారు ?

ఈ వాదన చేసేవారు మొదట తమను నాస్తికులుగా పిలుచుకుంటూ ప్రస్తుతం పాజిటివ్ నాస్తికులు (Positive Atheists) గా అభివర్ణించుకుంటున్నారు. ఈ ప్రశ్నకు సమాధానం ముందు పేజీలలో 'హేతువాదానికి, నాస్తికత్వానికి గల సంబంధం ఏమిటి?' అనే ప్రశ్నకు సమాధానంలో విపులీకరించబడినది.

హేతువాదము
సామాజిక పరమైన భావనలు

14. హేత్తువాదానికి, నీతికి గల సంబంధం. ఏమిటి ?

మానవుడు తన స్వేచ్ఛాసముపార్జన కొరకు సమాజాన్ని ఏర్పరచుకున్నాడు. మానవుడు ఆటవిక స్థితిలో, జంతువాసనలతో తన మనుగడకు పోరాటాన్ని జరుపుచున్న తరుణంలో సమాజం ఉద్భవించినది. చైతన్య స్థాయిలో సంకల్పించి సమాజాన్ని సృష్టించాడని చెప్పలేము. ఏది ఏమైనా ఆ సమాజం అతని అవసరాలను తీర్చుకుంటూ వస్తున్నది. సమాజంలో భాగంగా మానవుడు జీవించే టప్పుడు తోడివారితో తాను ఎలా సంచరించాలనే ప్రశ్న ఉదయిస్తుంది. అదే నీతికి దారి తీస్తుంది.

నీతికి ఆధారం మనస్సాక్షి లేక అంతరంగం. అంతరంగమంటే ఏమిటి ? చుట్టూవున్న పరిస్థితులను గుర్తించి, అవగాహన చేసుకొని ప్రతీకరించటం (react). నీతి అనగా అంతరంగానికి జరుగు విన్నపము. గుర్తింపుకాని, అవగాహనకాని సరిగా లేనప్పుడు మానవుడు పొరపాటు నిర్ణయానికి వచ్చే ప్రమాద మున్నది.

మానవ నీతిని నిర్దేశించవలసినది దేవుడా ? కాదు; ప్రవక్తలు, మత్రగంథాలుకూడ కాదు. నీతికి ఆధారం హేతుత్వ. హేతుత్వ శక్తిని వినియోగించుకొని మానవుడు పరిస్థతులను అవగాహనం చేసుకుంటాడు. మానవుడు ప్రాయికంగా హేతువాది గనుక అంతరంగ ప్రేరణతో నీతివంతుడు కాగలుగుచున్నాడు. పరిస్థతులను సరిగా అవగాహన చేసుకొనలేని వ్యక్తి నడత అవినీతికి దారి తీయవచ్చును. అందుకు బాధ్యుడు అతడే. అనుక్షణం మానవుడు చేతనావస్థలో ఏదో ఒకటి

నిర్ణయించవలసి వుంటుంది. వ్యక్తిగతమైన ఆహార, పానీయాదులే గాక సమాజంలోని మిగిలిన వ్యక్తులందరితోను సంచరించు ప్రవర్తనా సరళిలో కూడ మానవుడు తనకు తానుగా నిర్ణయించు కొనవలసి వుంటుంది. అందుకు కొన్ని నియమాలు, ఆధారాలు అవసరం. కనుక మానవుడు నీతికి ప్రాధాన్యత నివ్వనలసి వుంటుంది.

ఉపయోగవాద నీతి (Utliitarian Morality) ఆమోదించ రాదు. ఒక్కొక్కప్పుడు వైరితలలు వేసే వచ్చిస్వార్థానికి కూడ, సామాజిక విలువలను ప్రోసిపుచ్చి, అచ్చంగా ఉపయోగవాద నీతిపై ఆధారపడి నిర్ణయాలు చేసేవారు కూడ వున్నారు. కార్యం ఫలప్రదమయితే నీతికరము, విఫలమయుతే అవినీతికరము అని మార్క్సిస్టులు, మరికొందరు చెప్పటం పరిపాటి. ఇది అర్థరహితం. మానవ ప్రవర్తనను నిర్దేశించటానికి హేతుయుతమైన నీతి అవసరం.

15. హేతువాదం కుల వ్యవస్తను ఆమోదిస్తుందా ?

ఆమోదించదు. కుల ఆవిర్భావంపై అనేక సిద్ధాంత రాద్ధాంతాలున్నవి. కొందరు పనివిభజన, తత్ఫలితంగా వచ్చిన వృత్తి నైపుణ్యాన్ని చూపిస్తారు. మరికొందరు బ్రాహ్మణులు అగ్రవర్ణంగా చలామణి కావటానికి మిగిలిన వర్ణాలపై ఆధిపత్యం వహించటానికి కులవ్యవస్థను ఏర్పరచారంటారు. అసలు దోపిడీ కొరకే కులం పుట్టిందంటారు కొందరు. కులం ఏ విధంగా వచ్చినా శాఖోపశాఖలతో కూడిన విశాల విష వృక్షంగా పెరిగినది, పెరుగుచున్నది. అంతస్తులతో పాటు, ఫలితం అన్ని రంగాలలో అసమానత్వం, నిచ్చెన మెట్ల సమాజం, ఒక కులంవారు మరో కులంవారితో భోజన, వివాహాదులు చేయరాదనే కట్టుబాట్లు, చివరకు అంతిమ కులం అంటరానితనం అన్నీ యీ కులతత్వ విషబీజాలే.

మానవుని యింతగా కించపరచి, బాధలకు గురిచేసిన వ్యవస్థ మరొకటి లేదు. మానవుడు వస్తుతః హేతువాది గనుక ప్రతి మానవునిలో హేతుత్వశక్తి యున్నది. అయినా పరిస్థితుల అవగాహనలో తగ, తమ భేదాలుండటానికి అవకాశ ముున్నది. తల్లిదండ్రుల నుంచి పారంపర్యంగా వచ్చే లక్షణాలు, పుట్టినప్పటి ఆతని పరిస్థితి, ఆర్థిక స్థితిగతులు, పెంపు, విద్యావకాశాలు, తదితరమైన వెసులుబాట్లు మానవుని మానసిక శక్తిస్థాయిని నిర్దేశిస్తవి. అందువలన ప్రతి మానవుని అవగాహనలో, చర్య-ప్రతి చర్యలో ఒక ప్రత్యేకత కనబడుతుంది. అలా మానవులు విభిన్న ప్రవృత్తులు కలవారుగా కనబడటం సహజం. కాని వస్తుతః హేతుత్వశక్తిని కలిగి వుండటంలో భేదాభిప్రాయ ముండరాదు.

మానవ సమాజంలో ఉచ్చనీచ తేడాలు ఉండరాదు; ఉండ కూడదు. కనుక కులవ్యవస్థ నశించాలని, కులతత్వము సమూలంగా పోవాలని హేతువాదులు ఆశిస్తారు. కులతత్వాన్ని తాత్వికంగా, రాజకీయంగా సామాజికంగా ఎదుర్కొంటారు. తాత్వికంగా కర్మ సిద్ధాంతాన్ని, పునర్జన్మ సూత్రాన్ని త్రోసి రాజంటారు. రాజకీయంగా శాసనాల ద్వారా కులతత్వాన్ని పెకలించటానికి కృషి చేస్తారు. కులాంతర, వర్ణాంతర వివాహాలు, సమిష్టి భోజనాలు, విందులు ద్వారా సామాజికంగా కులాలను నామరూపాలు లేకుండా చేస్తారు.

16. హేతువాది మతావలంబి కావచ్చునా ?

అసలు 'మతము' అనే పదానికి ఉత్పత్తి అర్థం-అభిప్రాయము. కాని రూఢ్యర్థంలో దేవునిపై విశ్వాసంగా మారినది. దేవునికీ, మానవునకూ గల సంబంధాన్ని స్పష్టీకరించటం మత్రపాతిపదిక అయినది. దేవునికి అనేక రూపాలు, రూపాంతరాలు. ప్రకృతిలో

నిండి నిబిడీకృతమయిన దేవుడు అంతటితో ఆగలేదు. ఈ భౌతిక జగత్తుకు అతీతంగా నిర్గుణ, నిరాకార బ్రహ్మ లేక సకల లక్షణ గుణ గణాలతో విలసిల్లే సాకార పరబ్రహ్మ లేక సృష్టికర్త. ఆది మధ్యాంత రహితుడు; అందరినీ, అన్ని జాతులను శాసించే పరిపాలకుడు; వ్యక్తి ఎంపిక ననుసరించి అందరికీ ఆసరాగా, బాసటగా నిలబడే దివ్యమూర్తి; అవతారమూర్తి లేక మనుష్య రూపంలో ఉద్భవించే సాక్షాత్ నైవాంశసంభూతుడు; అవతారమూర్తి.

ఇలా అనేక రకాలుగా దేవుని గురించి ఎవరికి తోచినట్లు వారు చెప్పటం కద్దు. హేతుయుతంగా ఆలోచిస్తే దేవునికి అసలు ఉనికే లేదు. హిందూమతం ప్రకారం నిరాకార నిర్గుణ పరబ్రహ్మ సాకార సగుణ పరబ్రహ్మగా రూపాంతరం చెంది ఈ భౌతిక జగత్తు నంతటినీ సృష్టించాడు. (క్రైస్తవ ముసల్మాను మతాల తాత్విక దృక్పథం తక్కువ స్థాయిది కనుక వానిని పరిశీలించ నవసరంలేదు.) నిర్గుణ పరబ్రహ్మ సగుణ పరబ్రహ్మ ఎలా కాగలిగాడు ? సహేతుకమయిన సమాధానం లేదు. ప్రకృతికి బాహిరంగా దేవుడు ఉన్నాడనేదానికి ఋజువు లేదు. దేవుడు సృష్టికర్త అయితే మరి ఆ దేవుని సృష్టించినది ఎవరు ? కరుణామయుడైన దేవుడు భీతావహమైన ప్రకృతిని, దుష్టను, పాప భూయిష్టమయిన సమాజాన్ని ఎందుకు సృష్టించాడు ? క్రైస్తవ, ముసల్మాను మతాలలోని సైతాను పుట్టుకకు కారణ మేమిటి ? దేవుడు ఉన్నంతకాలము సైతాను ఉంటాడా ? ఉంటే దేవుని సర్వశక్తివంతుడని ఎలా అనగలము ? ఇట్టి ప్రశ్నలకు జవాబులు రావు; లేవు.

కనుక హేతువాది విషయాన్ని ఒకటికి నాల్గుసార్లు తరచిచూచి దేవుని ఉనికికి నిర్ధారణ లేదంటాడు. కొంతమంది శాస్త్రజ్ఞులు దేవుని అస్తిత్వం ఋజువు కాలేదంటారు. ఒక రకంగా నాకు తెలిసినంతవరకు

దేవుడు లేడు అని ఇరు తెగలవారు చెప్పకతారు. దేవుడే లేనప్పుడు మతం సంగతి వేరే చెప్పనక్కరలేదు.

కాగా మతములు మానవ సంఘాన్ని నిలువునా చీల్చినవి. మానవ చరిత్రలో మతం పేరిట జరిగిన దారుణ యుద్ధాలు అనేకం. మనిషి మరోమనిషిని ద్వేషించి ఒకరి కుత్తుక లొకరు నులుముకొనిన ఘట్టాలు కూడ చాల వున్నవి.

హేతువాది మతావలంబి కాజాలడు. ఇక్కడ ఒక విషయం స్పష్టపరచాలి. దేవుని ప్రసక్తి లేని బౌద్ధ, జైనులు శిసలైన మతావలంబికులైనారు. ఆదిమ బౌద్ధాన్ని, ఆదిమ జైనాన్ని అవలంబించే వారిని బుద్ధమతస్తులు, జైనమతస్తులు అని పిలిచే గందరగోళం సృష్టించటంకంటె బౌద్ధ ధర్మావలంబకులు, జైన ధర్మావలంబకులు అని పేరొక్కనటం సమంజసం. అలాకాక బుద్ధుని, మహావీరుని అవతార మూర్తులుగా భావించి భజించేవాగుంటే వారికి ఇతర మతస్తులకు భేదం లేదనే చెప్పవచ్చును.

17. హేతువాది జాతీయతను ఆరాధించ గలడా ?

హేతువాదిని జాతి, దేశపటాల ఎల్లలు బంధించజాలవు. ఆతనికి జాతి మమకారం, జాతి దురహంకారము, పరజాతి విద్వేషము ఉండవు. ఆతని దృష్టిలో మానవాళి అంతా ఒక్కటే. మానవులందరూ సమానులే. హేతువాదికి తర, తమ దృష్టి ఉండదు.

జాతి అనేది చరిత్ర, ఆచారాలు, పూజావిధానాలు, నాగరికత, సంస్కృతి, మానసిక ప్రవృత్తులపై ఆధారపడి వుంటుంది. నిజమే; కాని ప్రతి మానవుడు ఒక విలక్షణమైన వ్యక్తి (unique Individual) గా రూపొందినను మానవులంతా ఒకటే అయినట్లు ఒక జాతికి లేక దేశానికి చెందినవాడు ఇతర జాతులకు లేక దేశాలకు చెందిన

వారినుండి విభిన్న లక్షణాలు కలిగియున్ననూ మానవ ప్రపంచ మంతా ఒక్కటే. అట్లు భావించక జాతి లేక దేశం పేరుతో ఆరాధన మనస్తత్వాన్ని అలవరచుకునేవారు అంధ విశ్వాసాలకు లోనుగాక తప్పదు; పరజాతులను ద్వేషించే పరిస్థితికి దిగజారుతారు. అంతర్జాతి యుద్ధాలకు, అంతర్జాతీయ మారణహోమానికి దారి తీస్తారు. వివిధ జాతీయుల, దేశీయుల మధ్య సంఘర్షణలు, యుద్ధాలతో చరిత్ర పుటలు నిండియుండటం మన మెరుగుదుము. కనుక దేశాన్ని మాతగా ఆరాధించటం, పూజించటం తద్వారా హిందూరాష్ట్ర భావనను పెంపొందించటం హేతువాది చేయరాని పని.

18. హేతువాదికి వర్ణవిభేదములో నమ్మకం వుంటుందా ?

ఉండదు. 'వర్ణము' అను పదాన్ని రంగు అనే అర్థములో కాని, హిందూమతములో పేర్కొనబడిన 'వర్ణము'గా గాని వాడవచ్చును. రెండవ అర్థములో వర్ణమును గురించిన ప్రస్తావన కొంతవరకు కుల సమస్య వివరణలో వచ్చినది. వర్ణములేరు, కులములేరు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులని వర్ణములు నాలుగు. హిందూమత శాసన కర్తలచే దరిమిలా పంచమ వర్ణం (అవర్ణులు, అంటరాని వారు, హీనకులస్థులు) కూడ సృష్టింపబడినది. కులములు వర్ణము లలో అంతర్భాగం. భారతదేశంలో 5 వేల కులాలకు పైగా వున్నట్లు అంచనా.

ఇక వర్ణము అంటే రంగుగా భావిస్తే తెల్లవారు, నల్లవారు, ఎర్రవారు, పచ్చనివారు, గోధుమరంగు కలవారు ఇలా 5 రకాలుగా శరీర చర్మము కలిగిన మానవులున్నారు. మేధస్సు విషయంలో, తెలివి తేటలలో ఒక రంగువారు మరొక రంగువారికి తీసిపోరు. రంగు భేదమునకు కారణములు ముఖ్యముగా శారీరక ధర్మము, వాతావరణ పరిస్థితులు. మిశ్రమ వివాహములచే అట్టి తేడా కూడ

నశించగలదు. కనుక రంగునుబట్టి హెచ్చు, తగ్గులను కల్పించు కొనుట అవివేకం.

19. హేతువాది వర్గ విద్వేషాన్ని పెంపొందించ తగునా ?

తగదు. వర్గస్తులు మారుతుంటారు. నిన్నటి కార్మికుడు నేడు పెట్టుబడిదారుడు కావచ్చును. నేటి పెట్టుబడిదారుడు రేపు కార్మికుడు కావచ్చును. వర్గాల ఎల్లలు శాశ్వతం కావు. కులంతో వర్గాన్ని పోల్చి చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

ఇక ఒక వర్గంగా చెప్పబడే ప్రజల్లోనే అనేక విభేధాలున్నవి. ఉదాహరణకు కార్మికులలోనే సాంకేతిక నిపుణులు, హెచ్చురాబడి గలవారు, మామూలు కార్మికులు, పూటకు గడవని వారున్నారు. వర్గపోరాటాలు, ఆందోళనలు అవసరంగా కనబడవచ్చును. కాని మొత్తం సమాజాన్ని బంధించే సూత్రం సహకారమే. మానవులు, ఒండొరులు సహకరించుకుంటూ సాయపడకపోతే మానవ చరిత్ర ఇలా వుండేది కాదు. శాస్త్రజ్ఞాన మింత అభివృద్ధి చెందేది కాదు. ఆర్థికంగా, సాంస్కృతికంగా మానవుడు ఇంత పురోగమించేవాడు కాదు. దోపిడీలకు గురి అయి సమాజంలో అట్టడుగున అణగారి పోవుచున్న ప్రజానీకం తమ బాధల నివారణకు ఆందోళనలు సాగించటం సహజం, ధర్మం కూడాను. కాని కేవలం వర్గ విద్వేషం, వర్గ పోరాటం నేటి పరిస్థితులలో - సైనిక పాటవం, యుద్ధనైపుణ్యం, మారణ ఆయుధాలు కల ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎంతవరకు ఎదిరించి ఫలప్రదం కాగలవు ? అనేది ముఖ్యంగా ఆలోచించవలసిన విషయం. కనుక ప్రత్యామ్నాయంగా హేతువాది సహకార సూత్రం ద్వారా ప్రజాభిప్రాయానికి బలం చేకూర్చి ఆ అండదండలతో తనతోబాటు తనతోటివారిని, సమాజాన్ని బాగుపరచటానికి ప్రయత్నిస్తాడు.

20. హేతువాది స్త్రీలయెడ ఎట్టి వైఖరిని ప్రదర్శించాలి?

హేతువాది దృష్టిలో స్త్రీ, పురుషు లిద్దరూ వ్యక్తు లే. మానవ జాతిని సమ్యక్ దృష్టితో చూచు హేతువాది స్త్రీ జాతికి న్యాయత కల్పించడు. పూర్వకాలములో స్త్రీని అబల, వ్యక్తిత్వం లేని వస్తువు బిడ్డలను కని పెంచు యంత్రం, భోగ్యపదార్థం, పరిచారిక, చివరకు దాసి, బానిసగా భర్తలు, కుటుంబీకులు, సమాజం భావించటం పరిపాటిగా వుండేది. ఇది సహించరాని విషయం. కొంతవరకు పరిస్థితులు మారినవి. ఇంకా మారవలసిన అవసం ఎంతైనా వున్నది.

నిజానికి పరిస్థితులను ఎదుర్కొనగల శారీరక శక్తి స్త్రీలకు పురుషుల కంటె పదిశాతం ఎక్కువ మేధస్సుతో వారు పురుషులకు తీసిపోరు. అవకాశాలుంటే ఏరంగంలోనైనా రాణించగలరు. కాని పురుష దురహంకారం వారి కట్టి అవకాశాలు లేకుండా చేస్తున్నది. అంతేగాక పురుషజాతి స్వప్రయోజనం కొరకు స్త్రీ జాతిని మత ప్రభావానికి లోనుచేసి తరతరాలుగా మాయమాటలతో, మోసంతో దాస్యభావానికి గురిచేసినది. ఫలితం - ఇట్టి ప్రచారానికి ప్రభావితులయిన స్త్రీలు తమకు తామే పురుషులకంటె తక్కువ జాతిగా అంచనా వేసుకొనటం జరుగుచున్నది. వారి దాస్య శృంఖలాలను వారే బిగించుకుంటున్నారు. పురుషులు బంగారు సంకెళ్లతో వారిని బందీలు చేస్తుంటే స్త్రీలు ఆవి తమకు గౌరవంగా భావించి గర్వ పటడం మిక్కిలి విచారకరమైన విషయం.

హేతువాది యీ పరిస్థితిని అంగీకరించడు. స్త్రీని తోటి మానవ వ్యక్తిగా భావించి ఆమె వ్యక్తిత్వాహోదాను గౌరవిస్తాడు. మాతృమూర్తిగా ఆమె కుటుంబానికి చేయుచున్న ఎనలేని సేవను గుర్తిస్తాడు; అభినందిస్తాడు. హేతువాది దృష్టిలో వివాహిత స్త్రీ

భార్య అంటే భరింపబడేది కాదు. అలాగే పురుషుడు భర్త-భరించువాడు కాదు. వివాహిత స్త్రీ - పురుషులు ఆలుమగలు; సహధర్మచారులు.

21. సమాజంలో హేతువాది లైంగిక విజ్ఞానాన్ని పెంపొందించాలా ?

అది ఆతని విధిగా భావించాలి. లైంగిక విజ్ఞానం సక్రమంగా అందివ్వకపోతే లేక అందుబాటులో లేకపోతే యువతీ యువకులకు అనర్థం ? దాంపత్య జీవితానందాన్ని అనుభవించే అవకాశం మృగ్యం; తల్లికాబోయే స్త్రీకి ప్రమాదం; సుఖవ్యాధుల నుండి తప్పించుకునే మార్గం అసాధ్యం; కుటుంబ నియంత్రణ జ్ఞానం సున్న. చివరకు ప్రజాసామ్యానికి, మానవాళికి ముప్పు.

కుటుంబ నియంత్రణ వలన స్త్రీ శరీరారోగ్యం భద్రబడుతుంది. ఎక్కువమంది పిల్లలను పోషించవలసిన బాధ్యత తగ్గి తల్లిదండ్రులు సుఖపడతారు. జీవితపు విలువలు, విద్యానంస్కృతులు, వృత్తి నైపుణ్యం పెంచుకుంటారు. కుటుంబంలో ఖర్చు తగ్గటంతో సమాజంలో పొదుపు పెరుగుతుంది. అట్టి పొదుపు పెట్టుబడికి ఉపకరిస్తుంది. ఫలితం సమాజం పురోగమిస్తుంది.

కుటుంబ నియంత్రణ వలన స్త్రీకి సంతానము తగ్గడమే కాదు. బిడ్డల కొరకు ఆమె వినియోగించవలసిన కాలం కూడ తగ్గుతుంది. మిగిలిన కాలాన్ని ఆమె సద్వినియోగ పరచుకొని ఉద్యోగం చేయగలదు. లేక సాహిత్య, సంస్కృతులను అభివృద్ధి పరచుకొనగలదు. జనాభాలో సగం శాతంగా వున్న స్త్రీలు సంస్కారులైతే మానవ చరిత్రగతే మారుతుంది గదా ?

ఇంచుకు లైంగిక విజ్ఞానం అవసరం. కనుక స్త్రీ పురుషులందరికీ దీనిని అందుబాటులోనికి రావాలి. దాంపత్య జీవిత విజ్ఞానాన్ని రహస్యమైనదిగా, ఏహ్యమైనదిగా చిత్రించే మనస్తత్వాన్ని మార్చటం హేతువాదుల కర్తవ్యం.

22. హేతువాది వరకట్నం తీసుకొనవచ్చునా ? ఓలి ఇవ్వవచ్చునా ?

అట్టి పనులు చేయరాదు. స్త్రీని ఒక వస్తువుగా పరిగణించినప్పుడు ఓలి, కన్యాశుల్కము పుట్టినవి. పురుషాధిక్యతా భావం బాగా చోటుచేసుకొనిన తదుపరి, స్త్రీని సమాజంలో కుటుంబ పరిధిలో బంధించి విద్యావకాశాలు, ఉద్యోగార్హతలు లేని వ్యక్తిగా చేసినప్పుడు వివాహం కొరకు పురుషునికి లంచం ? ఇవ్వవలసి వచ్చినది. అదే వరకట్నం.

స్త్రీ, పురుష సమానత్వంలో విశ్వాసం వున్న హేతువాది లంచం లేక వరకట్నం అడగడు; ఇవ్వడు. ఓలి లేక కన్యాశుల్కం చెల్లించడు.

23. మూఢ విశ్వాసాలు, దురాచారాలు, జ్యోతిషం, సాముద్రికం వగైరాలను హేతువాది అంగీకరించ వచ్చునా ?

అంగీకరించకూడదు. మూఢ విశ్వాసాలు అనటంలోనే అవి హేతుయుతం కావని తేలుచున్నది. ప్రతి విషయాన్ని, అంశాన్ని, ఆచారాన్ని, విశ్వాసాన్ని హేతువాది హేతువాదం అనే గీటు రాతిపై గీచి పరీక్షిస్తాడు. క్రమబద్ధంగా, తార్కికంగా, శాస్త్రీయ పద్ధతిలో పరిశీలిస్తాడు. అనుభవానికి నిలుస్తుందా లేదా అని ఆలోచిస్తాడు. అన్నింటికీ తట్టుకొన్నవాటిని స్వీకరిస్తాడు లేనివాటిని విసర్జిస్తాడు.

యమ్. యన్. రాయ్ దృష్టిలో 'జ్యోతిష్యం, జ్యోతిర్గణితం ధర్మసంతానం'. గ్రహాలు మానవ జీవితంపై ప్రభావం చూపుతా యనేది జ్యోతిషానికి మూలిక సూత్రం. నవగ్రహాలని సూర్య, చంద్రాదులను చేరొక్కంటారు. సూర్యుడు గ్రహం కాదు. చంద్రుడు ఉపగ్రహం మాత్రమే. రాహుకేతువుల ఉనికియే లేదు. అవి ఊహాజనితములు మాత్రమే. నవగ్రహాలలో నాలుగు గ్రహాలు లేనప్పుడు ఇక జ్యోతిషం ఎలా నిలుస్తుంది ? తరచిచూచినప్పుడు ఇది అనుభవానికి నిలవదు.

సాముద్రికం విచిత్రమైన విషయం. తల్లి గర్భంలో వుండగా శిశువు ముడుచుకొని వుండటం వలన అరచేతులలో, అరికాళ్లలో రేఖలు ఏర్పడుతాయనే వాదన వున్నది. ఇట్టి రేఖలను అదృష్ట రేఖలుగా నిర్ణయించ బూనటం ఎంతవరకు సమంజసం ?

ఇస్లే చేతబడి వగైరాలు. అవి పూర్వపు మాంత్రిక విద్యలు (Magic). మంత్రశాస్త్రం, మతం రెండునూ ఆదిమ మానవుని హేతువాద పటిమ నుండి ఉద్భవించినవి. శాస్త్రజ్ఞానం పెరగటంతో అవి మూఢ విశ్వాసాలైనవి. వీటియందలి నమ్మకాల్ని హేతువాది వమ్ము చేస్తాడు.

24. హేతువాది దృష్టిలో వివాహ వ్యవస్థ, వివాహ పద్ధతులు ఎలా వుంటవి ?

నేటి వివాహ వ్యవస్థలో స్త్రీ అస్వతంత్రురాలు. సంరక్షకత్వాన్ని అపేక్షించే వ్యక్తి. ద్వితీయ శ్రేణికి చెందినది. భోగ్య వస్తువు. హిందూపద్ధతి ప్రకారం శాసనాలు రాకపూర్వం పురుషుడు వేలమంది భార్యలను (శ్రీకృష్ణుడు) కలిగివున్నట్లు పురాణాలు చెప్పుచున్నవి. ఇస్లాం మతం ప్రకారము ఒక పురుషుడు ఏకకాలమందు

నల్గురు భార్యలను కలిగి వుండవచ్చును. (కాని ఆచరణలో అనేక మందిని కల్గివుండటం చరిత్రలో కన్పట్టుచున్నది.) స్త్రీకి తన సంతానముపై తన సంరక్షకత్వం వహించటానికి అధికారముండదు. క్రైస్తవ మతంలో భార్యకు యజమాని భర్త.

శాసనాలు వచ్చేవరకు హిందూమతంలో విడాకులు లేవు. ఇస్లాం మతంలో పురుషుడు విడాకు లివ్వటానికి పూర్తి స్వేచ్ఛ వున్నది. 'తలాక్' అనే పదం మూడుసార్లు ఉచ్చరిస్తే చాలు. ఒక స్త్రీని భార్యగా వదిలించుకొని మరో స్త్రీని వివాహం చేసుకొనవచ్చును. (భార్యలు నల్గురే అయినా వివాహాలు అంతకుమించుతై) రోమను కాథలిక్కు క్రైస్తవులకు విడాకులు లేవు. ప్రొటెస్టెంటు క్రైస్తవులలో విడాకుల విషయంలో కఠినమైన నియమాలు విధించ బడ్డవి.

వివాహం అమలులో వున్నంతకాలం స్త్రీ శరీరంపై భర్తకు అధికారం కామం తీర్చుకొనటానికే. స్త్రీ యిష్టాయిష్టాలతో పురుషునికి నిమిత్తం లేదు. భర్త ఎక్కడ కాపురముంటే ఆమె అక్కడే వుండాలి. స్త్రీ సంపాదనలో, అనుభవంలో ఆమెకు అధికారము లేదు. చివరకు సంతానోత్పత్తిలో కూడ స్త్రీ నీరసించినా, జబ్బు పడినా, మరణదశకు చేరినా భర్త శాసనం ప్రకారం పురుష్లు పోసుకొనటం తప్పటం లేదు. పురుషుని ధనం, హోదా, పేరుప్రతిష్టలు, అతడు సమకూర్చే సౌకర్యాలు, భద్రతకోసం స్త్రీ వివాహబంధంలో చిక్కుకుంటే అది వ్యభిచారమే అవుతుంది. పురుషునిపట్ల కూడ అంతే. యజమాని, వస్తువు; అమ్మట, కొనుట అను భావన పోవాలి. కనుక దీనిని మార్చాలి. స్త్రీ పురుషులు సమాన హోదాలో ఆలుమగలుగా, స్నేహితులుగా, సహచరులుగా, పరస్పర ప్రేమాభిమానములు పెంచుకుంటూ, ఒకరి నొకరు గౌరవించుకుంటూ

దాంపత్య జీవనము జరుపుకొనునదియే సరియైన వివాహ బంధము. అలాంటి వివాహ వ్యవస్థ కావాలి.

నేటి పెండ్లి పద్ధతులు చాలవరకు అశాస్త్రీయంగా వున్నవి. హిందువుల వివాహ పద్ధతిలో కన్యాదానం, పాణిగ్రహణం, సప్తపది, మంగళసూత్రధారణ వగైరాలు ఆచారాలుగా ప్రముఖ స్థానాన్ని పొందినవి. కన్యాదానాన్ని మహాత్మాగాంధి కూడా నిరసించారు. దానం చేయటానికి కన్యవస్తువా అని ప్రశ్నించారు. పాణిగ్రహణం, సప్తపదులలో పురుషాధిక్యత కొట్లవచ్చినట్లు కనబడుతుంది. ఇక మంగళసూత్రధారణ- కన్యను జంతువుగా పరిగణించి త్రాళ్లతో బంధించటమే. పెండ్లికుమారుడు పెండ్లికుమార్తెను త్రాళ్లు (తాలి) కట్టి పరిణయమాడటం ఆమెను తోలుకు పోవటానికి సరిసమానమే.

ఇస్లాం మతం ప్రకారం నికాహ్ రిజిష్టరులో వధువు సంతకం అక్కరలేదు. ఆమె తరపున తండ్రి, పినతండ్రి లేక మేనమామ సంతకం చేస్తాడు. ఆమె మౌనాన్ని అంగీకారంగా పాటిస్తారు. క్రైస్తవ మతం ప్రకారం స్త్రీ పురుషుని యజమానిగా స్వీకరిస్తుంది. భర్త (Husband) అనే పదంలోనే ఆ భావం వున్నది. ఈ మత పద్ధతులు పోవాలి. నిజమైన గాంధర్వ వివాహానికి తావుండాలి. తమిళనాడులో ప్రభుత్వం పూలదండల పెండ్లిని శాస్త్రసమ్మతం చేసినది. ఆ పద్ధతి మంచిది. పెద్దల సమక్షంలో అలాంటి పెండ్లి జరిగితే అందరికీ శ్రేయస్కరం.

25. నామకరణం, శుద్ధస్నానం, అంత్యక్రియలు, మాసికాలు, తద్దినాలు వగైరా విషయాలలో హేతువాదుల అభిప్రాయం, పద్ధతులు ఏమిటి ?

పుట్టుక, చావు శరీర ధర్మాలు. సామాజిక అవసరాలనుబట్టి, గుర్తింపుకొరకు నామకరణం చేయవలసి వుంటుంది. వేడుకలు

చేసుకొనినా మంత్ర, తంత్రాల ప్రమేయం అనవసరం. అలాగే ఒక వ్యక్తి మరణించటమంటే చేతనావస్థలో నున్న ఆతని లేక ఆమె శరీరము జడంగా మారుతుంది. దానిని శవము లేక కళేబర మంటాము. ఆలసించితే అది క్రుళ్ళి దుర్గంధ భూయిష్టమై చుట్టు నున్న వారలకు ప్రమాదం కల్గిస్తుంది. కనుక దానిని దూరంగా పూడ్చిపెట్టటం, తగలపెట్టటం, రాబందులకు ఆహారంగా వదలి పెట్టటం వగైరా మార్గాలు చేపట్ట బడ్డవి.

హిందూ, ముస్లిము, క్రైస్తవ మతాలలోని కొన్ని కులాలవారు శవాన్ని పూడ్చిపెట్టటం ఆచారం. ఎప్పుడో ఒకప్పుడు దేవుని తీర్పుకొరకు మరల జీవి లేచి వేచియుండాలనే మూఢ విశ్వాసంతో కొందరు శవాన్ని పేటికలో భద్రపరచి పూడ్చిపెట్టటంకూడా కద్దు.

హిందువులలో ఎక్కువమంది దహనం చేస్తారు. శరీరంలోని ఆత్మ సూక్ష్మ శరీరరూపంలో బయటకు రాగానే స్థూల శరీరము జడమై శవమవుతుంది. సూక్ష్మ శరీరధారి తన కర్మానుసారం కర్మను అనుభవించటానికి మరో జన్మగా మరో స్థూల శరీరంలో ప్రవేశిస్తాడని హిందువుల విశ్వాసం. కనుక ఆ శరీరం నిరుపయోగమని, దహన సంస్కారాలు చేయటం అవసరమని వారి భావన.

కళేబరంకూడా వృధాకారాదు, దానిని పశు, పక్ష్యాదులకు ఆహారంగా యివ్వటం మానవతా దృష్టి అనే ఉద్దేశ్యంతో పార్శీలు దానిని చాల ఎత్తైన ప్రదేశంపై వదలి వేస్తారు. దానిని రాబందులు భక్షిస్తవి. కొందరు తమ మరణానంతరం తమ శరీరాలను వైద్య కళాశాలలకు అప్పగించాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తారు. అవయవాలు సరిగ్గా వుండి కళ్లు, మూత్రపిండాలు, గుండెకాయలు ఇతరులకు ఉపయోగపడునట్లుంటే వైద్యశాలలకు ఇవ్వటం మంచిదే.

దహన సంస్కారానికీ మత సంబంధమయిన, మంత్రతంత్రాలు, దైవప్రార్థనలు అనవసరం. చనిపోయిన వ్యక్తి గొప్పదనాన్ని గురించి దహన సంస్కారానికి ముందు చెప్పటంలో అభ్యంతరం లేదు.

ఇక మాసికాలు, తద్దినాలు వగైరా. చనిపోయిన వ్యక్తి అప్పటివరకు మన మధ్య చైతన్యవంతంగా కనబడ్డాడు. బంధువులు, స్నేహితులు, అతనిపై ప్రేమాభిమానాలు చూపారు. మరి అట్టి వ్యక్తి ఇక లేడనే భావన బాధాకరంగానే వుంటుంది. అయితే వాస్తవానికి ఆ వ్యక్తి ఇక లేడు. లేని వ్యక్తిని ఇక్కడే ఈ లోకంలో వున్నాడని భావించటం విపరీతనం. కనుక అతడు మరో లోకంలో వున్నట్టు భ్రమింప చేయాలి. అక్కడ అతడు తన జీవనయాత్ర సాగించటానికి ఇల్లు-వాకిలి, పొలం-పుట్ర, పాడి-పంటలు, ధన-కనక-వస్తువాహనాలు అన్నీ కావలసివుంటుంది. కనుక హిందూమతాచారం పేరుతో బ్రాహ్మణ పురోహితులు వాటిని తమకూ తమ తోటి బ్రాహ్మణులకు దానం చేయించుకుంటారు. ఇట్టి దానాలు సూక్ష్మ శరీరధారి అయిన ఆ మరణించిన వ్యక్తికి చేరగలవని బంధుమిత్రులను విశ్వసింప చేస్తారు. వారి మనోదార్బల్యాన్ని ఆసరాగా తీసుకొని బ్రాహ్మణులు పన్నిన పన్నాగం, మంత్రాంగం మాత్రమే యిది.

మన బంధువు లేక మిత్రుడు చనిపోయాడని అనుకొనక ఆతడు మరో లోకంలో వున్నాడని భావించితే ఆతనికి ఆహారం కావాలి కదా? ఎలా అందచేయాలి? ఎప్పుడు అందచేయాలి? పురోహిత బ్రాహ్మణ వర్గం వెంటనే సమాధానం చెప్పగల్గినది. సంవత్సరంలో నెలకొకసారి 'మాసికం' పెట్టి బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలాదులతో భోజనం పెట్టి సంతృప్తి పరచాలి. వారు తృప్తాస్మ (తృప్తి చెందాము) అని అంటే మరణించిన వ్యక్తి తృప్తి చెందినట్లు.

ఇందులో ఒక రహస్య మున్నది. బ్రాహ్మణ వర్గానికి భుక్తి గడు స్తుంది. ఆధిపత్యం, గౌరవం దక్కుతవి.

ప్రతి సంవత్సరం, ప్రతినెల పురోహిత వర్గాన్ని తృప్తి పరచటం తేలికయిన విషయం కాదు. అందుకు మృతుని బంధు మిత్రులు అంగీకరించక పోవచ్చును. కనుక 'మాసికాలు' మొదటి సంవత్సరానికే పరిమితం చేయబడినవి. తరువాత తద్దినాలు ప్రవేశ పెట్టబడినవి.

తద్దినం సంవత్సరాని కొకసారి జరుపబడే తంతు. తద్దినం అంటే తత్ + దినం. అంటే వ్యక్తి ఏరోజున చనిపోయాడో ప్రతి సంవత్సరం అదే రోజున తద్దినం పేరుతో బ్రాహ్మణులను, పురో హితుని 'మాసికం' పద్ధతిలో తృప్తి పరచాలి.

చనిపోయిన వాడిని సంస్మరించటం ఒక విధంగా విద్యుక్త ధర్మంగానే పాటించవచ్చును. కాని అభ్యంతరకర విషయాలు (1) మరణం తరువాత జీవి సూక్ష్మ శరీరంలో వుంటాడు. (2) అప్పుడో లేక మరికొంతకాలానికి స్థూల శరీరంలో ప్రవేశించి పునర్జన్మ ఎత్తు తాడు. (3) పితృలోకంలో వున్నప్పుడు అతనికి వస్తు సముదాయం కొరకు అట్టివే దానములు చేయాలి. (4) శాస్త్రజ్ఞానానికి విరుద్ధ మయిన భావాలతో మంత్ర, తంత్రాలు సాగుతవి. (5) పితృదేవత లకు పురోహితులు ఏజంట్లుగా వ్యవహరిస్తారు. (6) పురోహితులు బ్రాహ్మణ వర్గానికే చెందాలి. (7) నమ్మశక్యం గాని విషయాలను పురోహిత వర్గం నమ్మించి ప్రజలను దాస్యభావంలో ముంచెత్తి తమ సేవకు వినియోగించుకొన గలుగుతుంది. (8) కర్మలు, తంతులు, దానాల రూపంలో స్వప్రయోజనాలను సాధించగలుగు తుంది.

శుద్ధిస్నానం పేరుతో క్రైస్తవమత గురువులు, ఉపనయనం పేరుతో హిందూమత పురోహితులు ప్రజలను పునీతం చేస్తామని ప్రజలకు అర్థంకాని మంత్ర, తంత్రాలతో తంతు నాశిస్తారు. దీని నంతటినీ మతంతో ముడి పెడ్తారు. కనుక హేతువాది అన్ని మతాల తంతులను నిరసిస్తాడు; వ్యతిరేకిస్తాడు. పురోహిత వర్గం చేసే బండ రాన్ని, మోసాన్ని బట్టబయలు చేస్తాడు. ప్రతి విషయాన్ని హేతు యుతంగా ఆలోచించి నిర్ణయాలకు వస్తాడు. చనిపోయిన వారికి దహన సంస్కారం, సంస్మరణ దినం జరుపుకొని తన విధిని ముగించు కుంటాడు.

హేతువాదం - జీవిత రీతులు

26. హేతువాదుల జుట్టు, బొట్టు, కట్టు ఎలా వుండాలి?

మానవుడిలోని ప్రత్యేకతను, విలక్షణ తత్వాన్ని హేతువాది అంగీకరిస్తాడు. ఏ వ్యక్తి అయినా తనకు ఇష్టమయిన రీతిలో తన వ్యక్తిత్వాన్ని, రూపాన్ని, అందాన్ని పెంపుచేసుకొనుటకు తగిన విధంగా జుట్టు, బొట్టు, కట్టు కలిగి వుండటంలో అభ్యంతర ముండ రాదు. ఇది ఆశ్చర్యపడవలసిన విషయం కూడా కాదు. భిన్నత్వంలో ఏకత్వము, ఏకత్వములో భిన్నత్వాన్ని చూడగల సత్తా హేతువాది కున్నది.

ఒకనికి హిప్పీలాగ జులపాలు కలిగిన జుట్టు బాగుంటుంది. మరొకరకపు క్రాపు ఇంకొకనికి అందాన్నిస్తుంది. ఒకొరకపు కేశాలం

కరణ ఒకో స్త్రీకి ఆకర్షణను చేకూర్చి పెడుతుంది. అలాగే పురుషుల మీసాల విషయంలో కూడాను. అమరావతీ శిల్పాలలో 20 రకాల కేశాలంకరణ విధానాలున్నట్లు కనబడుతుంది. హేతువాదులంతా ఒకే రీతిలో వేషధారణ చేయాలనటం, ఒకే రకంగా జుట్టు పెంచుకోవాలనటం అర్థరహితం.

బొట్టు విషయం కొంచెం ఎక్కువగా ప్రస్తావించవలసి వుంటుంది. మతానికోరకం, శాఖకోరకం బొట్లు అమలులో నున్నవి. హిందూ మత్తయిదువులకు బొట్టు పరమ పవిత్రం. అది కూడా ప్రాంతాన్నిబట్టి మారుతూ వుంటుంది. తమిళ స్త్రీల బొట్టు ఒక రకం, బెంగాలీ మహిళల బొట్టు, పాపటలో సిందూరము మరో రకం. మహమ్మదీయ, క్రైస్తవస్త్రీ, పురుషులు బొట్టు పెట్టుకొనరు.

హిందూ స్త్రీల బొట్టుకు మరోరకపు అర్థంకూడా వున్నది. బొట్టు ఆమె వివాహానికి, లైంగిక జీవితానికి సంబంధం కల్గి వుంటుంది. రజస్వల అయినది మొదలు ప్రసవించే వరకు స్త్రీ జీవితము లైంగిక సంబంధముగా గమనించ బడినది. రజస్వల, గర్భదానము, గర్భిణి, ప్రసవవేదన అన్నిటికీ సీమంతాదులు, మంత్ర, తంత్రాల వాడావుడియే.

పెండ్లికాగానే స్త్రీ కుంకుమతో బొట్టు పెట్టుకొనాలి. వైధవ్యం సంభవిస్తే పదియవ రోజున బొట్టును అమానుషంగా చెరిపి వేస్తారు. స్త్రీని కురూపినిచేస్తారు. ఉద్దేశం? స్త్రీ భర్త ఆస్తికనుక ఆమెను ఇతరులెవరూ ఆశించరాదు. ఆమె లైంగిక జీవితాను భవానికి దూరంకావాలి. అందుకు ఆమెను అసహ్యంగా, అనాకర్షణీయంగా తయారు చేయాలి. కాగా బొట్టుకు మరోవిశేషంకూడా వున్నది. మగనాలిగా వున్నప్పుడు స్త్రీ రక్తం లేక ఎర్రని రంగు

గల కుంకుమ బొట్టుతో అలంకరించుకొనాలి. బొట్టులేని స్త్రీ ముట్లు డిగిన స్త్రీతో సమానము. అంటే సంతానాన్ని ఆశించరాదు.

ఇంతకూ హేతువాదాన్ని బలపరచే స్త్రీలు కుంకుమ బొట్టు పెట్టుకొనాలా, అక్కరలేదా? మత దృష్టిని విడనాడారు కనుక అక్కరలేదన వచ్చును. కాని మతస్థులుగా వున్న క్రైస్తవ, మహమ్మదీయ వనితలు అసలు బొట్టునే ధరించరు కదా! కనుక బొట్టుకూ, మతానికి సంబంధ ముండరాదు. బొట్టును కేవలం అలంకార విశేషంగానే గ్రహించాలి. వయస్సుతో, వివాహిత, అవివాహిత లేక విధవ అనే తారతమ్యాలతో బొట్టుకు ప్రాధాన్యత నివ్వరాదు. అలంకరణ దృష్టితో అందరూ బొట్టు పెట్టుకొనవచ్చును లేక విడనాడ వచ్చును.

27. హేతువాదుల పేర్లు ఎలా వుండాలి?

మనిషికి నామకరణం చేసేటప్పుడు మత ప్రసక్తి మెండుగా కనబడుతుంది. దేవుళ్లు లేక పూర్వీకులపై నున్న శ్రద్ధాసక్తులతో లేక జన్మ నక్షత్రం పేరుతో నామకరణం జరుగుతూ వుంటుంది. ఇది మత ప్రమేయంతో కూడిన పనిగా భావించి విడనాడటం మంచిది. పూర్వీకులపై గల భక్తిశ్రద్ధల కారణంగా వారి పేర్లను తమ సంతానానికీ, తమ బిడ్డల సంతానానికీ పెట్టటం సహజంగా జరుగుతుంది. కాని అసలు విషయం పూర్వీకులు పూర్తిగా లేక హెచ్చుగా మతస్తులు కనుక వారి పేర్లు సహజంగా దేవుళ్ల పేర్లుగా వుంటవి. కనుక ఆ ఆచారానికి స్వస్తి చెప్పాలి. కులాలు, మతాలు, దేవుళ్లను స్మరించే పేర్లను హేతువాదులు విడనాడటం మంచిది. 'పేరు గుర్తింపుకొరకే' అను విషయాన్ని మరువరాదు. పేరులోనున్న గుణగణాల ననుసరించి వ్యక్తికి ప్రాధాన్యత వుండదు.

28. వ్యక్తి పూజ, వీరారాధనలకు హేతువాదుల దృక్పథ మెట్టిది ?

హేతువాది ఏ భావాన్ని, ఏ సిద్ధాంతాన్ని, ఏ వ్యక్తినీ పరమ పవిత్రంగా ఎంచడు. దేనినీ గ్రుడ్డిగా విశ్వసించడు. శాస్త్రీయ దృక్పథంలో పరిశీలిస్తాడు. తర్కానికి, అనుభవానికి నిలువగలదో, లేదో తరచిచూస్తాడు. మేధావులు, మహానుభావులు తమ కాలానికి అవసరమైన సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ వుంటారు. వారెంత గొప్ప వారయినా యుగధర్మాన్ని పూర్తిగా విస్మరించలేరు. సార్వకాలిక మైన సత్యాలను ప్రకటించనూలేరు. వారు మార్గదర్శకులు మాత్రమే. పరమ సత్యం అంటూ ఏమీ లేదు. ఎవరూ ప్రవక్తలు కారు. అంతా సాపేక్షమే కదా !

భజన సమాజం లేక మరో సంఘంలోని వ్యక్తులు ఎప్పుడూ వారి గురువు, నాయకుడు, వీరుని ఆజ్ఞలను మించి ఆలోచించలేరు, ఆచరించనూలేరు. కనుక వారి స్వేచ్ఛా ప్రవృత్తి, సత్యాన్వేషణా శక్తి క్షీణించి మందబుద్ధులై చిలుక పలుకులు వల్లెవేస్తూ వుంటారు. విచక్షణా జ్ఞానాన్ని, వివేకాన్ని కోల్పోయి చక్కభజనలు చేస్తూ వుంటారు. అదే వ్యక్తిపూజ లేక వీరారాధన. దానిని సహాజంగా హేతువాది వ్యతిరేకిస్తాడు.

29. హేతువాది నిరాడంబరంగా వుండాలి కదా ? ఆడంబరాన్ని త్యజించాలి కదా ?

ఆడంబరం, నిరాడంబరం అనే పదాలు ఇటీవల బాగా ప్రచారం లోనికి వచ్చినవి. అంగవస్త్రము, పూరి యిల్లు, బస్సు ప్రయాణం, రైలులో చివరి తరగతి మొదలైనవి నిరాడంబరానికి సూచనలుగా చలామణి అవుచున్నవి. ఇది నిజంగా విశ్వసించి

ఆచరించటమా లేక ప్రజానీకాన్ని ఆకర్షించటానికా అనేవి ఆలోచించాలి. 'దరిద్రనారాయణుని'తో, సామాన్య పౌరునితో తాదాత్మ్యం పొందటానికి చేసే తపస్సు అయితే అది వ్యక్తిగతం. అట్టి చర్య ఒకరి ఇష్టాఇష్టాలపై ఆధారపడి వుంటుంది. కాని ఆధునిక విజ్ఞానం యిచ్చే రకరకాల వెసులు బాటులను, యంత్రాలను వినియోగించు కుంటూ 'ఇంతవరకే - ఇంతకుమించి పోరాదు'. (Thus far - no further) అనటంలో అర్థమేమిటి? సిద్ధాంత ప్రాతిపదిక ఎట్టిది? పాదయాత్రలు, ఒంటెద్దు లేక రెండెడ్ల బండిలో ప్రయాణం చేయటం నిరాడంబరమనుకుంటే అవి సువిశాల ప్రాంతమయిన దేశంలో కార్యసాధనకు, గమ్యస్థానం చేరటానికి ఎంతవరకు ఉపకరించ గలవు? స్వంతంగా మోటారుకారు కల్గివుండరాదు. మరి ఇతరుల కార్లలో ప్రయాణించటం ఎంతవరకు సబబు? కోర్కెలు చంపుకొనుట నిరాడంబర లక్షణం కాదు. నిరాడంబరం పేరుతో ప్రజలను మోసగిస్తూ ఆడంబరాన్ని ప్రదర్శించేవారు కూడ లేక పోలేదు.

ఆడంబరం అంటే ఏమిటి? వేష-భాషలు, ఇల్లూ-వాకిల్లూ, వాహనాలు మొదలయినవన్నీ అవసరం మేరకు స్తోమతు ననుసరించి ఎవరు ఎలా వాడుకొనినా ఆడంబరం కానేరదు. ఉపయోగానికి మించి, సౌందర్య భావనను అధిగమించి, ఇతరత్రా తమ గొప్ప తనాన్ని చాటుకొనజాలక, అసలు గొప్పతనమే లేక ఏదో ఒక విధంగా తనను గురించి ఇతరులు గొప్పగా చెప్పుకొనాలనే తలంపుతో తనకుమించిన దుస్తులు, వాహనాలు, ప్రాసాద వైభవము, డాబుసరుల్లు, మంది మార్బలం, వందిమాగధులు, ఆత్మస్తుతి, పరనింద మొదలయినవి ఆడంబర చిహ్నాలు. వీటిని హేతువాది అసహ్యించుకొని వీటికి దూరంగా వుంటాడు.

మరోవిషయం. తన ఆర్థిక స్థాయికి తగిన జీవితమే నిరాడంబరత అని ఆస్థాయి మాత్రమే అనుసరణీయమని హేతువాది చెప్పడు. ఆయావ్యక్తుల ఆర్థికస్థాయికి తగ్గియున్ననూ, ఆడంబరం లేని జీవితమే ఉత్తమం.

ఇంతకూ లోతుగా పరిశీలిస్తే నిరాడంబరత బాహ్యరూపం కంటె నిరాడంబర మానసిక వైఖరి ముఖ్యమైనది. అమెరికాలో ధనవంతుల పెంపుడుబిడ్డ నిక్కనుకంటె బీదల అభిమానాన్ని చూరగొనిన కెన్నెడీ గొప్పవాడే కదా!

30. హేతువాది శీలానికిచ్చే విలువ ఎంత?

శీలం అనగానే లైంగిక పరమైన అర్థంగా, ఏకపత్నీవ్రతంగా పాతివ్రత్య ధర్మంగా పేరొకనటం పరిపాటి అయినది. ఇచ్చట శీలం అనేపదం ఇంకా సువిశాలమైన అర్థంలో వాడబడుచున్నది. త్రికరణశుద్ధి అవసరము. అంటే మనోవాక్కాయ కర్మల భేద ముండరాదు. 'చెడుచూడను, వినను, చెప్పను' అను మూడు కోతుల నీతి సూత్రమున్నది. ఒక మేధావి - కోతులు 'చెడుచేయను' అని అనటం లేదుగదా అని చమత్కరించాడు. 'చెడువినను, చెడుచెప్పను' బాగానే వున్నవి. మరి 'చెడుచూడను' అంటే జరుగుచున్న చెడును చూడకుండా నిర్లిప్తంగా వుండటమా లేక అట్టిచెడును జరుగకుండా ప్రతిఘటించటమా? లేక ఇతరులు చేసే 'చెడును చూడను" అని మాత్రమే అర్థమా? తనలో, సమాజంలో చెడును సహించి మాకేభావం వహించే వారంతా దోషులే. "చెడు చూడను" అనటంలో పరోక్షంగా దోషికి సాయపడచున్నట్లే.

మనసులోని భావానికి, పలికే పలుకుకు, చేసే చేతకు పొంతన వుండాలి. సమన్వయం కుదరాలి. అలా సంచరించ గల్గినవాడే

శీలవంతుడు. అన్ని సందర్భాలలో అట్టి శీలవంతునకు విజయం చేకూరక పోవచ్చును. ఒక విధంగా అట్టివారు ఎక్కువసారులు విఫలం కావటంకూడా కద్దు. కాని వారి విఫల ప్రయత్నాలు తోటిమానవులకు, సమాజానికి ఆశాకిరణాలు; ఉత్తేజకారణాలు; మార్గదర్శక సూత్రాలు. వారి సంఖ్య పెరుగుదలపై సమాజ ప్రగతి ఆధారపడి వుంటుంది.

31. హేతువాది దృష్టిలో లక్ష్య-సాధనలు ఒకే స్వభావం కలిగివుండాలా ?

అవును, ఉండాలి. చెడుసాధనలతో మంచి లక్ష్యాలను సాధించగలమనుకొనటం వట్టిభ్రమ. ఉదాహరణకు నియంతృత్వం ద్వారా ప్రజాస్వామ్యాన్ని సాధించలేము. మోసంతో నీతిప్రదమైన సమాజాన్ని నిర్మించలేము. ప్రజలలో ప్రబోధం వంచనద్వారా జరుగకూడదు. అది విజయాన్ని చేకూర్చినా తాత్కాలికమే; గమ్యాన్ని చేర్చదు.

మంచిభావాలు కలిగివుండటం మంచిదే. కాని అంతటితో ఆ ధ్యేయం ఆగకూడదు. (The way to hell is planned with good intentions)ఆచరణలో సన్మార్గాలుకూడ అవలంబించాలి. సమాజ సేవకునిగా, నిష్కలంక దేశభక్తునిగా గుర్తింపబడినవారనేకమంది వక్ర మార్గాలు చేపట్టటంతో చివరకు దుర్మార్గులుగా, ప్రజాకంటకులుగా, నిరంకుశులుగా, నియంతలుగా మారిన ఘట్టాలు మనకు చరిత్రలో అనేకం కనబడుచున్నవి. స్వార్థపరుడు తన స్వప్రయోజనాల కొరకు ఇతరులకు చెడుచేయటం సహజం. అట్టి వానిని సమాజం వెంటనే గుర్తిస్తుంది. కాని స్వార్థత్యాగం, పరోపకారం పేరుతో సంచరించు గోముఖ వ్యాఘ్రాలను గుర్తించటం కష్టం. వారి వలన సమాజానికి

తీరని నష్టం కలుగుతుంది. కనుక లక్ష్యంతోబాటు సాధనంకూడ ఉత్తమమైనది కావాలనటం నిర్వివాదాంశం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మన లక్ష్యాలుగా అంగీకరించినప్పుడు ఆ విలువలకు అనుగుణమైన సాధనాలు చేపట్టటం విధిగా జరగాలి.

32. సౌందర్యోపాసన మానవునిలో అంతర్గత ప్రేరణా ?

అవును. మానవుడు స్వేచ్ఛాసక్తుడు. కనుక సత్యాన్వేషకుడు. తన వ్యక్తిత్వం వికసించాలంటే, హుందాగా జీవించాలంటే ప్రగతిశీల సమాజాన్ని కాంక్షిస్తాడు. సమాజ జీవితంలో తన జీవితాన్ని సమన్వయం చేసుకుంటాడు. తానూ, తనతోబాటు సమాజం వడిదుడుకులులేని ప్రగతి పథంలో పయనించ గలిగినపుడు మానవుడు పులకితుడవుతాడు; సౌందర్యోపాసకుడు కాగలుగుతాడు.

సత్యం, శివం, సుందరం మానవ జీవిత సోపాన మార్గాలు. మానవ జీవితంలో సౌందర్య ప్రభావమును ఇదమిత్థమని నిర్ణయించ జాలము. పసిపాప బోసినోటి నవ్వు; అందాన్ని, పరిమళాన్ని సమకూర్చు పుష్పము; చిత్తరువులోని ఆకర్షణ; సంగీతంలోని మాధుర్యం; నాటకం లేక సినిమాలోని నటనా చాతుర్యం, వైరుధ్యం మానవుని ఆనందానికి, సౌందర్యోపాసనకు మచ్చుతునకలు. ఇది మానవుడు కావాలని తెచ్చిపెట్టుకొనిన భావంకాదు. వస్తుతః అతనిలో సౌందర్యోపాసన నిండి నిబిడీకృతమైయున్నది. మానవునిగా ఆతని సృజనాత్మకశక్తి. ఇది హేతుత్వానికి వ్యతిరేకంకాదు; వైరుధ్యంలేదు. వ్యక్తి వికాసాన్ని దోహద పరచేది, వ్యక్తిని పులకిత పరచేది హేతుయుతమే.

—o—

హేతువాదం : సాంఘిక సంస్కరణలు - సామాజిక విప్లవము

33. సంస్కరణలకు, విప్లవానికి గల సంబంధం ఏమిటి?

ప్రస్తుత సమాజం వ్యక్తి వికాసానికి, స్వేచ్ఛకు దోహదం చేసేదిగా లేదు. ప్రజానీకంలో అధికభాగం ఆర్థికంగా దుర్బల స్థితిలో నున్నది. రాజకీయ అధికారాలు మృగ్యం. సమాజపు కట్టుబాట్లలో ప్రజలు నలిగిపోవు చున్నారు. సామాజిక వ్యవస్థ మారాలి. సమూల మైన మార్పు రావాలి. దానినే సామాజిక విప్లవంగా భావించ వచ్చును.

సంస్కరణకు విప్లవానికి తేడా వున్నది. ఏదో ఒక రంగంలో, ఏదో ఒక విషయంగా ఒక అంశానికి సంబంధించిన కొలది మార్పు, సంస్కరణ. విప్లవం అంటే వున్న సామాజిక సంబంధాలు మారి సరిక్రొత్త నూతన వ్యవస్థ ఏర్పడటం. సంస్కరణకూ, సామాజిక విప్లవానికీ గల సంబంధ మేమిటి? చాలమంది సంస్కర్తలకు సమ్యక్ దృష్టి లోపిస్తుంది. తాత్కాలికం. అల్పం అయిన మార్పును తమ ప్రధమ లక్ష్యంగా భావిస్తారు. కాని కాలం గడచిన కొలదీ ఆ లక్ష్యసాధననే పరమ లక్ష్యంగా భావిస్తారు. సంస్కరణల కొరకు సంస్థలను నిర్మిస్తారు. వాటి అస్తిత్వం కొరకు నిధులు కావాలి; వనరులు ఏర్పరచాలి. కనుక అధికార వర్గాన్ని ఆశ్రయించటానికి అర్రులు చాచుతారు. రాజీదృక్పథం, ఉన్న వ్యవస్థతో ఏదో ఒక విధంగా సర్దుకుపోయే మనస్తత్వం ఏర్పడతవి. ముందుచూపు నశిస్తుంది.

ఇది మామూలుగా సంస్కరణలకు ప్రథమ స్థాన మిచ్చే వ్యక్తుల, సంఘాల దిగజారుడు విధానం. కాని మరో తరగతికి చెందినవారు- మున్ముందుగా ఒక విప్లవ దృష్టిని, ఒక సమ్యక్ దృక్పథాన్ని అలవరచు కుంటారు. సమగ్ర పథకంలో భాగంగా సంస్కరణను చేపట్టుతారు. వారి దృష్టిలో సంపూర్ణ విప్లవం సాధించటానికి సంస్కరణలు సోపానాలు; సాధనలు మాత్రమే. గమ్యం విప్లవం. సామాజిక విప్లవాన్ని అపేక్షించేవారు గమ్యాన్ని మరచిపోరు. కాని ఎంత చిన్న సంస్కరణ నయినా ఈసడించరు. పై పెచ్చు ఆహ్వానిస్తారు. అయితే అమలులోనున్న వ్యవస్థతో రాజీపడరు. లక్ష్యసాధన, గమ్యం గురించి అనుక్షణం ప్రజలను హెచ్చరిస్తూనే వుంటారు. సమగ్ర విప్లవాన్ని సాధించే వరకు విశ్రమించరు; శ్రమిస్తూనే వుంటారు. సామాజిక విప్లవానికి, సాంఘిక సంస్కరణలకు గల సంబంధం గమ్యానికి, సాధనాలకు గల సంబంధం మాత్రమేనని గ్రహించాలి.

హేతువాదం : ఇతర సిద్ధాంతాలు

34. హేతువాదము : నాస్తికత్వము.

హేతువాదు లందరూ నాస్తికులుగా చలామణి కావటం లేదు. నాస్తికులందరూ హేతువాదులు కారు. హేతువాదులలో అజ్ఞేయ వాదులు (Agnostics) కూడా వున్నారు. 'దేవుడు ఉన్నాడో, లేడో నాకు తెలియదు. నాకు అనవసరం. నేను నీతిగా బ్రతకాలి; బ్రతుకు

తాను' అనే బౌద్ధులు అజ్ఞేయవాములు. వారు నాస్తికులు కారు. కాని వారికి హేతుత్వంలో విశ్వాసమున్నది.

ఇక నాస్తికులలో రెండు తెగలవారున్నారు. ఒకరు నాస్తికత్వం యొక్క విశిష్టతను గురించి చెప్పుతారు. నాస్తికత్వం అంటే దేవుడు లేడనటమే కాదు; ఒక జీవిత విధానం అంటారు. వ్యతిరేకార్థ సూచకంతోపాటు ప్రయోజనాత్మక, ప్రకటనార్థ సూచకంగా వాడుతారు. అనుకూల నాస్తికులు (Positive Atheists) అని పిలుచుకుంటారు. కాని నాస్తికత్వం అనే పదానికి గల ఉత్పత్తి అర్థము లేక రూఢ్యర్థము వీరి వాదనను బలపరచదు. వేదాలను ప్రమాణంగా తీసికొననివారు నాస్తికులు. ఇది ఉత్పత్తి అర్థము. ఆధ్యాత్మికవాదులు వేదప్రమాణాలను లెక్కచేయని బౌద్ధులను నాస్తికులుగా తృణీకరించారు. క్రమేపి దేవుడు లేడనే వారిని నాస్తికులుగా భావించటం పరిపాటి అయినది. ఇది రూఢ్యర్థం. కాని దీనికి మరొక విశేషణం చేర్చి స్వయం సంపూర్ణం చేయాలనే సంకల్పము కొందరిలో కనబడుచున్నది. విశేషణము ఒక నామవాచక పదానికి ప్రత్యేకత చేకూర్చాలి గాని గందరగోళ పరచకూడదు. 'నాస్తికుడు' అంటే వ్యతిరేక అర్థాన్నిచ్చే పదం. దానికి ముందు విశేషణం 'అనుకూల' పదం వ్యతిరేకార్థానికి వ్యతిరేకం. అనుకూల నాస్తికులు లేక ప్రతికూల నాస్తికులు అంటే అర్థమేమిటి? అయోమయాన్ని సృష్టించటం వినా ఇందులో మరో విశేషం కనబడదు. ప్రపంచమంతా హేతువాదం నుండి మానవ వాదానికి పర్యటన చేస్తుంటే నాస్తికవాదాన్ని పట్టుకొని వ్రేలాడటం ఎంతవరకు శ్రేయస్కరం?

ఇంతకూ వీరి దృష్టిలో హేతువాదం లోపభూయిష్టం. 'హేతువాదం కార్యకారణ నియమాన్ని అంగీకరిస్తుంది. ఆ సూత్రాన్ని చివరివరకు అన్వయిస్తే దేవుని ఉనికికి దారి తీస్తుంది' అని వీరి వాదన.

హేతువాదం కార్యకారణ నియమాన్ని అంగీకరించటం వాస్తవమే. కాని నేల విడిచి సాముచేయదు. శాస్త్రీయ పద్ధతిలో సత్యాన్వేషణ సాగిస్తుంది. శాస్త్రము (Science) ఋజువు కానంతవరకూ దేనినీ అంగీకరించదు. కనుక పైన ఉదహరించిన వారి వాదనకు విలువ లేదు. కార్యకారణ సూత్రం చివరిలో దేవుని సృష్టికర్తగా చూపవలసివస్తే అదే సూత్రం 'దేవుని సృష్టించిన దెవరు?' అనే ప్రశ్నను కూడ వేస్తుందని వీరికి తెలియదా?

ఆధ్యాత్మిక వాదులు అట్టి ప్రశ్నను అడుగరాదని నిషేధిస్తారు. 'దేవుడు స్వయంభూ' అని వారి వాదన. మరి ప్రకృతికి కూడ అదే సూత్రం ఎందుకు అన్వయింపరాదు? కనుక శాస్త్రం ప్రకృతి ఆద్యంతాలను గురించి వృథాశ్రమకు లోనుగాక వాస్తవిక జగత్తునే గుర్తిస్తుంది. కాని ఆధ్యాత్మిక వాదుల పరిభాషనే ఈ నాస్తికవాదులు కూడా చేపట్టి హేతువాదులను విమర్శించ బూనటం హాస్యాస్పదము.

వీరు మరొక వాదనను కూడ లేవనెత్తారు. "కార్యకారణ నియామాన్ని అంగీకరిస్తే మానవుడు స్వేచ్ఛను కోల్పోతాడు? ఇది విచిత్రమయిన వాదన. మానవుడు సర్వస్వతంత్రుడని, తలచుకుంటే ఏపని అయిననూ నిరాటంకంగా చేయగలడని, కార్యకారణ సంబంధం అతని స్వతంత్రతకు అడ్డుగోడ అని వీరి భావన కావచ్చును. మానవుడు సంకల్పబలుడే; అందులో సందేహంలేదు. భౌతిక జగత్తులో, సామాజిక వ్యవస్థలో మానవ సంకల్పం శక్తివంతము, ప్రముఖమునయిన కారణం అవుతుంది. కాని సర్వస్వతంత్రతను ఆపాదించటం వాస్తవాన్ని గుర్తించక పోవటమే. ఒక కార్యానికి ఒకేకారణం వుంటుందని, అది కేవలం మానవ సంకల్పం మాత్రమే అని భావించటం పొరపాటు. ఇతర కారణాలుకూడ అనేకం వుండటానికి అవకాశం వుందని గుర్తించాలి.

ఇక రెండవ రకపు నాస్తికవాదులు- హేతువాదం అవసరమేకాని అంతకు మించినది, ప్రాధాన్యత కలది "గతి తార్కిక భౌతికవాద" మని వాదిస్తారు. అంతటితో ఆగరు. శ్రమ ఫలితపు దోపిడీ (Exploitation) జరుగని సమాజం కొరకు కృషిచేయువారే శిసలయిన నాస్తికులని, ఇతరులు ఆపేరును ఉపయోగించు కొనుటకు అనర్హులని వీరి వాదన. ఈ వాదనలో రెండు లోపాలున్నవి. ఒకటి - సమ సమాజం (కమ్యూనిజం) కొరకు కృషిచేయువాడే శిసలయిన నాస్తికుడని భావించటం. నాస్తికుడంటే దేవుడు లేడనే వాడని ఇదివరకే తెలుసుకున్నాము. సమాజం కొరకు కృషిచేసే నాస్తికులు, దానిని వ్యతిరేకించే నాస్తికులుకూడ వుండవచ్చును. పదాల అర్థములకు వ్యతిరేకంగా పదములను ఉపయోగించుట వలన భాషకేకాదు, భావగందరగోళంకూడా జరుగుతుంది. ఇది క్షంతవ్యంకాదు. సమ సమాజ నిర్మాణాన్ని వ్యతిరేకించే హేతువాదులు మాత్రం వుండరు.

ఇక రెండవది - హేతువాదంకంటె గతి తార్కిక భౌతిక వాదాన్నే గొప్పగా భావించటం. గతి తార్కిక భౌతిక వాద సూత్రాలను పరిశీలిస్తే ఈ వాదనలోని బండారం బయటపడుతుంది. ఈ సూత్రాలు మూడు.

(i) వ్యతిరేక అంశాల మధ్య ఐక్యత.

ఇది ప్రాచీన గ్రీకుల చర్చావిధానంలో వచ్చిన గతి తర్కాన్ని అరువు తీసుకొన్న జర్మను తత్వశాస్త్రజ్ఞుడు హెగెల్ ప్రతిపాదించిన సూత్రం. హెగెల్ భావవాది. అతడు ప్రతిపాదించినది గతి తార్కిక భావవాదం కాని ఆ సూత్రాలనే కార్ల్ మార్క్స్ చేపట్టి భౌతిక వాదానికి అన్వయింప చేశాడు.

గ్రీకు చర్చలకు ప్రాతిపదిక - ఒక సిద్ధాంతం - అనుయోగి (Thesis) ప్రతిపాదింప బడుతుంది, అది పూర్వపక్షం Anti-Thesis) చేయబడుతుంది. రెంటి సమన్వయ ఫలితం సంయోగి (Synthesis) అంటే 'అనుయోగి'కి ప్రతిద్వంద్విగా 'ప్రతియోగి' వస్తే 'సంయోగి' ఉద్భవిస్తుంది.

(ii) పరిమాణం పెరిగిన కొలదీ ఒక దశలో గుణాత్మకమైన మార్పు వస్తుంది.

నీరు 100° సెంటిగ్రేడ్‌లో వేడిచేయబడినపుడు ఆవిరి కావటం సత్యం. దీనిని ఉదాహరణగా తీసుకొని ఏంగెల్సు చరిత్రలో గంతులు (leaps) అంటే విప్లవాలు వస్తవని చెప్పాడు. అసలు ఈ ఉదాహరణయే తప్పు. నీరు ఆవిరి అయినపుడు పదార్థస్థితి మాత్రమే మారినది కాని గుణాత్మకమైన మార్పుజరుగలేదు. పైగా చరిత్రలో విరామా (Gaps) లున్నవి గాని గంతులు లేవు.

(iii) ప్రతిషేధానికి ప్రతిషేధం (Negation of Negation)

ఉదాహరణకు గ్రుడ్డుపగిలి పిల్ల వస్తుంది; విత్తనం నశించి మొక్క వస్తుంది. $-a \times -a = a^2$ అని ఏంగెల్సు చెప్పాడు. ఇది చావటానికి, కనటానికి చూపుచున్న వుదాహరణ. గ్రుడ్డు రూపంలో పిల్ల అదిపరకే వున్నది. అది ఒక దశను చేరినప్పుడు పిల్ల ఆకారం చెందుతుంది. అలాగే విత్తనంలోనే మొలకవున్నది. పరిస్థితుల ప్రభావం వలన వికసించి మొక్కగా, చెట్టుగా, వటవృక్షంగా మారుచున్నది.

గిట్టటానికీ, పుట్టటానికీ సంబంధంలేదు. అనేక జీవరాసులు సంతానోత్పత్తి చేస్తున్నవి కాని చావటం లేదు. అల్లాగే వృక్షసముదాయం కూడాను. $-a \times -a = a^2$ సూత్రాన్నే ఎందుకు గొనుకోవాలి? $a \times a = a^2$ కదా? లేక a అనుయోగి అయితే $-a$.

ప్రతియోగి. $a \times -a = -a^2$ సంయోగి అవుతుంది. ఏంగెల్సు దీనిని ఎందుకు గమనించలేదు ?

ఈ త్రికాన్ని చరిత్రకు అన్వయంచేసి మార్క్సు, ఏంగెల్సులు చారిత్రక నియతి వాదాన్ని సృష్టించారు. ఒక చావుకు మరో పుట్టుక వుంటుందని దీనిభావం. ఆదిమ కమ్యూనిజం అంతరించి పూజారీ విధాన వుత్పత్తి జరుగుతుంది. అలాగే జమీందారీ విధానం, పెట్టుబడిదారీ విధానం, అంతిమంగా శిసత్రైన కమ్యూనిష్టు విధానం ఉద్భవిస్తవి. కమ్యూనిజం అంతరిస్తే తరువాత ? అంతరించదా? సమాధానం లేదు.

ఈ సిద్ధాంతం ప్రకారం అభివృద్ధి అనివార్యం. $-a \times -a = a^2$. కాని $a \times -a = -a^2$ అనే సూత్రం తిరోగమనాన్ని సూచిస్తున్నది. పెట్టుబడిదారీ విధానంలోనే దాని మరణ బీజాలున్నవి. అవి కమ్యూనిజ ఆవిర్భావానికి దోహదం చేయగలవు అని మార్క్సు, ఏంగెల్సు వక్కాణించి చెప్పగలిగినా అందుకు ప్రతిగా జర్మనీలో ఫాసిజం అవతరించినది. ప్రతిషేధానికి ప్రతిషేధం మారుగా అనుషేధం వచ్చినట్లు కదా ? ఇందుకు మార్క్సు అనుయాయుల నుండి మనకు సరియైన సమాధానం రాదు.

చారిత్రక నియతివాదంతోబాటు ఆర్థిక నియతివాదం కూడా పుట్టినది. మార్క్సు తన ఉద్గ్రంథమయిన 'కాపిటల్' లో యీ సిద్ధాంతాన్ని గురించి విపులంగా చర్చించాడు. మానవ జీవితం, సమాజం, సాహిత్య-సంస్కృతులు, నాగరికత ఆదిగాగల అన్నింటికీ ఉత్పత్తి సాధనాలే మూలాధారం. మానవుడు ఆర్థిక జీవి. పరిస్థితులకు బానిసగా చూపబడ్డాడు. మానవ సంకల్పం, మానవ యత్నానికి తగిన ప్రాముఖ్యత చూపబడలేదు.

ఈ త్రికాన్ని మానవ సమాజానికి పర్తింపజేస్తూ ఏంగెల్స్ మానవుడు వస్తుతః మంచివాడు అని చెప్పేదానికంటె చెడ్డవానిగా చెప్పటం గొప్ప విషయంగా భావించాడు. అంటే మానవులలో చెడు స్వభావమే బలీయంగా వుందని భావన. మానవ స్వభావాన్ని గురించి ఇట్టి అభిప్రాయం వెల్లడించిన సిద్ధాంత కర్తలు నీతి విషయంలో కూడ తప్పడడుగు వేసినారు. మార్క్సిస్టు నీతి ద్వంద ప్రవృత్తిని కలిగి వుంటుంది. నీతి యెడల విముఖత (Amoral) ప్రదర్శిస్తుంది. ధర్మం కొరకు అధర్మ పద్ధతులను, నీతికొరకు అవినీతికర మార్గాలను చేపట్టుతుంది. లక్ష్యం మంచిదయితే సాధన లెట్టివయినా ఫరవాలేదనే సిద్ధాంత మిది.

ఈ విధంగా పరిశీలిస్తే మార్క్సిస్టు గతి తర్కం లోపభూయిష్టం; సత్యదూరం కూడాను. కనుక దీనిని హేతువాదాన్ని మించినదిగా వేర్కొనటం అసమంజసం.

35. హేతువాదం, అజ్ఞేయ వాదానికి వున్న భేదమేమిటి ?

హేతువాదం నాస్తికత్వానికి దారి తీస్తుంది. కారణం దేవుని ఉనికికి ఋజువు లేదు. 'దేవుడు ఉన్నాడని నేను చెప్పను. దేవుడు లేడని నేను ఋజువు చేయలేను' అంటుంది అజ్ఞేయవాదం. చాలమంది శాస్త్రజ్ఞులు (Scientists) ఈ వైఖరిని అవలంబిస్తారు. ఇది శాస్త్రీయ పద్ధతిగా కన్పట్ట వచ్చును. కాని శాస్త్రానికీ, తత్వానికీ (Philosophy) గల సంబంధాన్ని పరిశీలిస్తే ఈ వైఖరి సమర్థనీయంగా కనబడదు. శాస్త్రం, తదితర విషయజ్ఞాన సమన్వయ ఫలితమే తాత్విక సిద్ధాంతము. తార్కిక సూత్రాల ప్రకారం వచ్చే భావాన్ని అంగీకరించటం, ఋజువు కాని విషయాన్ని త్రోసిరాజనటం తాత్విక చింతన. తత్వవిచారం కొనసాగిస్తే దేవుడు లేడనే సమాధానానికి రాక తప్పదు. అదే నాస్తికత్వం. కాని అజ్ఞేయవాదం ఈ సమస్యను

తేల్చుక కప్పదాటు వేస్తున్నది. దీనివలన భావవాదానికి మరికొంత కాలం మనుగడ సాగించే అవకాశం లభిస్తున్నది.

36. హేతువాదం కర్మసిద్ధాంతాన్ని, పునర్జన్మ వాదాన్ని అంగీకరిస్తుందా ?

మానవుడు తన కర్మ ఫలితాన్ని తాను ఈ లోకంలో అనుభవించక తప్పదనేది కర్మ సిద్ధాంతమయితే హేతువాది అంగీకరిస్తాడు. లేక మరోజన్మలో అనుభవిస్తాడనటం సమ్మతించడు. అక్కడక్కడా కొంతమంది 'మేము పూర్వజన్మలో ఫలాన గ్రామంలో ఫలాని వారిగా జన్మించి ఫలాన కార్యాలు చేసియున్నామని' చెప్పటం, వాటిని ప్రజలు నమ్మటం మనం వింటూనే యున్నాము. కాని అట్టి సంఘటనలపై కూలంకషంగా దర్యాప్తు జరిపించిన తరువాతనే నిర్ణయానికి రావాలి. అవాస్తవిక విషయాలను నమ్మినవారు వాటిని చూసినట్లుగానే ఇతరులకు చెప్పుతారు. ఉదాహరణకు దయ్యాలు, దేవుళ్ళను గురించి కొందరు తమ స్వానుభవాలను వర్ణిస్తూ వుంటారు. ఇది వారి వారి మానసిక ప్రవృత్తులను బట్టి నిర్ణయించవలసిన విషయం. అంధవిశ్వాసాలు ప్రబల, మానసిక రుగ్మతలకు గురి అయిన వ్యక్తికి అట్టి సంఘటనలు సహజమే. ఇవి వారి స్వీయ అనుభవం మాత్రమే. కాని ఇతరులకు చూపజాలరు.

శాస్త్ర పద్ధతిలో జరుగు అన్వేషణ కిట్టి స్వీయ అనుభవాలు నిలువలేవు. సమ్మోహ నిద్ర (Hypnotic State) లోనికి పంపబడిన వ్యక్తికి పునర్జన్మలో విశ్వాసముంటే ఆ స్థితిలో అతనిని 'పూర్వ జన్మలో నీ వెవరవు' అని ప్రశ్నిస్తే ఫలానా అని చెప్పుతాడు. కాని తరువాత జాగ్రతి అవస్థలో అదే ప్రశ్న వేస్తే సమాధానం రాదు. కనుక ఎక్కడో, ఎవరో తమ పూర్వజన్మ వృత్తాంతాలు విడమరచి చెప్పుచున్నారని వచ్చే వార్తలు కేవలం మోసపూరితాలు. ఆన్వేషణకు దిగితే అన్ని విషయాలు బయటపడతై.

ఒకరు మరణించిన తరువాత పిత్రులోకంలో కొంత కాల ముండి తరువాత స్వర్గం లేక నరకంలో జీవయాత్రసాగించి తిరిగి భూలో కంలో పునర్జన్మ ఎత్తటం సహేతుకమా ? అలా చెప్పటంలో సబ బెంతవరకు ? పునర్జన్మ సిద్ధాంతానికి సూక్ష్మశరీరం లేక జీవాత్మ ప్రధానం. మరణానంతరం జీవి, లేక జీవాత్మ మరోస్థూల శరీరాన్ని ఆశ్రయిస్తుంది. ఆదిమ మానవుడు జనన, మరణాలనుగురించి అనాది కాలంలో ఆలోచించి సంతరించుకొనిన భావమిది; ఊహాజనితం. దీనికి ఇంతవరకూ నిదర్శనాలు లభించకపోయినా ఈ భావన మాత్రం చావలేదు.

బౌద్ధులు, జైనులు పునర్జన్మను అంగీకరిస్తారు. కాని వారి సిద్ధాంతాల్లోని ఆత్మకూ, హిందూ సిద్ధాంతంలోని ఆత్మకు భేద మున్నది. ఏమైనా పునర్జన్మ సిద్ధాంతంలో విశ్వాసమున్నపుడు దేవుడు నొడ్డిదారినైనా రావటానికి అవకాశం లభిస్తుంది. అందుకనే ఆయా మతాలలోని బుద్ధుడు, జైనుడు భగవానులుగా తిష్టవేశారు. ఇక హిందూమతం సరేసరి. ఏది ఏమైనా కర్మసిద్ధాంతానికీ, పునర్జన్మ వాదానికీ ఏమాత్రం ఆధారాలులేవు; నమ్మదగినవి కావు.

37. హేతువాదం: అవతారమూర్తులు, బాబాల మహత్తులు

హేతువాదపు థాటికి దేవుడే ఎగిరిపోతే ఇక అవతార మూర్తుల వునికికి అవకాశం ఎక్కడనుండి వస్తుంది ? బాబా లనే ముసుగుతో కొందరు కుహనాగురువులు గ్రుడ్డిగానమ్మే ప్రజలను మాయజేసి మభ్యపరచి, నమ్మించి సమాజాన్ని దోచుకుంటున్నారు. మహత్తుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. వారు చేసేవి, చూపేవి మహత్తులుకావు; హస్తలాఘవ చర్యలు. అనేకమంది మాంత్రికులు (Magicians) చేసే చర్యలవంటివి మాత్రమే. మ్యాజిక్కు చేసేవారు నిజాయతీపరులు. వారు తాము చేసేపనులు మ్యాజిక్కు

గానే చెప్పి ప్రజలను ఆనందపరుస్తూ వుంటారు. బాబాలు వాటినే మహత్తులుగా చూపి ప్రజలను వంచన చేస్తారు. ఒక బాబా శూన్యంలోనుండి విభూతి యిస్తే మరొకరు మంగళసూత్రాలు, దేవుళ్ళ విగ్రహాలు యిస్తారు. ఇవి ఎలాసాధ్యం? శాస్త్రజ్ఞానం మనకు నేర్పిన పాఠం శూన్యంలోనుండి ఏదీరాదు; రావటానికి వీల్లేదు.

సత్యసాయిబాబా ఇచ్చే గడియారాలు, ఉంగరాలు, విగ్రహాలు అన్నీ అంతకుముందు ఇతరత్రా తయారుచేయబడినవే. ఆయన సృష్టికాదు. పైగా అన్నీ అరచేతితో ఇమిడే చిన్నవస్తువులే; పెద్ద గుమ్మడికాయలు అడగండి. ఇవ్వలేడు. నదీజలాలను పెట్రోలుగా మార్చమని కోరండి, చేయలేడు. సముద్రపు నీటిని మంచి నీరుగా మార్చమనండి, చేయలేడు. ఆహారధాన్యాలను, వెండి, బంగారాలను సృష్టించి దేశ దారిద్ర్యాన్ని పారద్రోల మనండి. చేయలేడు. మ్యాజిక్కుచేసే సత్యసాయిబాబా మనం కోరుకునే దేనినీ సృష్టించలేడు. అయినా ప్రజలు మోసపోతూనే వున్నారు.

చిన్ని సత్యసాయిబాబా పేరుతో బెంగుళూరు సమీపంలోని ఒక గ్రామంలో ఇదే విధమయిన మోసం జరుగుతూ వుండటం, బెంగుళూరు విశ్వవిద్యాలయం వారు నియమించిన సంఘం ఆ రహస్యాలను బహిర్గతం చేయటం మనకు తెలుసు. ఈ బాబాల మోసాన్ని పటాపంచలు చేయాలి. వీరి బెడద ఎంత త్వరగా వదలితే సమాజం అంత త్వరగా ముందుకు పయనించటానికి వీలు కల్గుతుంది.

38. హేతువాదం: లౌకిక తత్వం.

హేతువాదికి పరలోకంలో విశ్వాసం లేదు. లౌకిక తత్వమంటే ఐహిక మనబడు యీ లోకపు దృష్టి మాత్రమే. హేతువాదికి

కనబడేది, భావించేది ఒకే ఒక జీవితం. అందులోనే మనుగడ సాగిస్తూ మంచిగా, సంతృప్తికరంగా జీవించటానికి ప్రయత్నిస్తాడు. తన పొరపాట్లకు, దుష్టకార్యాలకు తానే బాధ్యునిగా గ్రహిస్తాడు. తన కర్మ ఫలితాలను తాను ఈ లోకంలోనే అనుభవించవలసి వుంటుందని గుర్తిస్తాడు. కనుక నీతివంతునిగా జీవించటానికి శతవిధాల ప్రయ స్తాడు. హేతువాద నీతి లౌకిక నీతి మాత్రమే.

39. హేతువాదము : లౌకిక రాజ్యవాదము.

హేతువాది సహజంగా లౌకిక రాజ్యవాది. ఇందులో మూడు రకాల లౌకిక రాజ్యవాదు లున్నారు.

(i) రాజ్యాన్ని నాస్తిక తత్వప్రచారానికి వాడేవారు. సోవియటు రష్యా, చైనా మొదలయిన కమ్యూనిష్టు దేశాల పరిపాలకులు.

(ii) రాజ్యం ఏ మతాన్నిగాని, మతభావనను గాని ప్రోత్స హించరాదు. "రాజ్యానికీ, మతానికి సంబంధం ఉండరాదు. మధ్య అడ్డుగోడ వుండాలి" అని చెప్పే జెఫరసన్ లాంటివారు.

(iii) "రాజ్యం మతరహితం కాదు. మతభావనను పెంపొం దించాలి; ప్రోత్సహించాలి. కాని కేవలం ఏ ఒక్క మతప్రాబల్యానికి దోహదం చేయకూడదు." ఇది మాజీ రాష్ట్రపతి డా. రాధాకృష్ణన్ వంటి హిందూమతానుయాయుల అభిప్రాయం. వీరి వాదనను ప్రస్తుత భారత ప్రభుత్వం ఆమోదించటం వలన ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు మతవ్యాప్తికి దోహద పడుచున్నవి. ఇది గర్హ నీయము. హేతువాదుల హక్కులకు భంగకరమే కాక ఉత్తరోత్తరా

అల్పసంఖ్యాకుల మతములు పరిగణన లేని స్థితికి రాగల ప్రమాద మున్నది. కనుక భారతదేశం, రెండవ మార్గాన్ని అనుసరించటం ఉత్తమం.

—o—

హేతువాద ఉద్యమం

40. హేతువాద ఉద్యమ సంఘటన ఆవశ్యకత.

మతశక్తులు విజృంభిస్తున్నాయి. సంప్రదాయభావాలు పెచ్చు పెరుగుతున్నాయి. దేవుళ్ళు, పూజారులు బలపడ్తున్నారు. మంత్రులు, ముఖ్యమంత్రులూ, అధికారులూ, బాబాలు అమ్మలు స్వాములవార్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ప్రజాసంస్థల ఆవరణలలో ఉదాహరణకు బస్సు డిపోలలో దేవాలయాలు నిర్మించబడుతున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలలో మతం చోటు చేసుకున్నది. శంకు స్థాపనలు, భూ పూజలు, గృహప్రవేశాలు పూజారుల ఆధ్వర్యంలో ప్రభుత్వాలు జరుపుతున్నాయి. ఆఫీసులలో శ్రీరామనవమి ఉత్సవాలకు అంతులేదు. ప్రభుత్వ బొక్కసంలోని ధనం మతవ్యాప్తికి వినియోగపడ్తున్నది. రేడియో, దూరదర్శిని, క్షేత్రప్రచార విభాగం, సమాచారశాఖలలో మతం పీఠం వేసుకుంది. భజన చేసుకోమని (మత్తులో పడి ఉండమని) మహిళా మండలులకు తాళాలు, చిరుతలు ఇస్తున్నది ప్రభుత్వం. నైతిక ప్రబోధం పేరుతో, సుభాషితాల ప్రసారం పేరుతో మతప్రచారం రేడియోలో బాహాటంగా జరుగు

తున్నది. ఇక హరికథలు, పురాణాలు సరేసరి. చివరకు సంస్కృత పాఠంలో కూడ మతబోధయే. నగరాలలో, పట్టణాలలో, గ్రామాలలో రోడ్లమధ్య గ్రొత్త దేవుళ్ళు వెలుస్తున్నారు. వెలసిన దేవుడికి నెల తిరగకముందే దేవాలయం; సంవత్సరము తిరుగకముందే గోపురం. రహదారులకు అడ్డమైతే ఎవరికి పడ్తుంది ? దేవుళ్ళ విహారానికి, భక్తుల స్వైరవిహారానికి అడ్డు ఆటంకాలు లేకుండా పోయినయి.

ఈ అత్యాచారాలను అరికట్టాలంటే, ఈ దుర్మార్గాలను రూపుమాపాలంటే, ఈ మూఢ్యశక్తుల దాడిని ఎదుర్కోవాలంటే మతమూఢ్యాన్ని నిరశించేవారందరూ అంటే - హేతువాదులూ, హ్యూమనిస్టులూ, నాస్తికులూ, తీవ్రవాద నాస్తికులూ, సంపూర్ణ నాస్తికులూ, అజ్ఞేయవాదులూ, లౌకికవాదులూ అందరూ- దేశ, రాష్ట్ర, జిల్లా, తాలూకా-పట్టణ, గ్రామస్థాయిలలో కనీస కార్యక్రమప్రాతిపదికపై సంఘటితం కావాలి. సమైక్యంగా కృషిచేయాలి.

41. హేతువాదుల కర్తవ్య మేమిటి ?

స్థానిక, జిల్లా, రాష్ట్ర, కేంద్ర సంఘాలలో హేతువాదులు సంఘటితమై సమిష్టిగా కార్యక్రమాలు సాగిస్తూ, అవతారమూర్తులు, బాబాలు, అమ్మల మోసాలను బట్టబయలు చేసి వారి ఆటలు కట్టిస్తూ, అంధవిశ్వాసాలను, మూఢాచారాలను పటాపంచలు చేసి శాస్త్రీయ దృక్పథాన్ని, శాస్త్రవిజ్ఞానాన్ని పెంపొందిస్తూ ప్రజానీకం హేతుయుతంగా ఆలోచించే మార్గాలను సుగమనం చేయాలి. అందుకు ఈ దిగువ కార్యక్రమం ఉపకరిస్తుంది.

—o—

హేతువాదులకు ఒక కార్యక్రమం

1. వ్యక్తిగతంగా

1) విమర్శనా దృష్టిని పెంపొందించుకోవాలి.

2) నిజాయితీని, ఋజు ప్రవర్తనను అలవరచుకోవాలి.

3) అవతలి వ్యక్తిని హేతుత్వ శక్తిగల సమాన పౌరునిగా భావించాలి.

4) తన ప్రవర్తనకు, తన చుట్టూవున్న సంఘానికి బాధ్యత వహించాలి.

చెడు అయితే సంఘాన్ని మార్చటానికి ఉద్యమించాలి.

5) ప్రకృతికి అతీతమయిన శక్తులపై ఆధార పడకుండా తనపై తాను ఆధారపడాలి.

6) అన్యాయాన్ని ఎల్ల వేళలా, ఎల్ల చోట్లా వ్యతిరేకించాలి.

2. కుటుంబ జీవితంలో

1) స్త్రీలను పురుషులతో సమాన హోదాతో చూడాలి.

2) పిల్లలను పెరుగుతున్న వ్యక్తులుగా పరిగణించి వారి మానసిక ఉద్వేగపు పెంపుదలకు ప్రోత్సాహం ఇవ్వాలి.

3) సమాజంలో పాతుకుపోయిన అర్థరహితమైన అలవాట్లను, సంప్రదాయాలను విడనాడాలి.

4) హేతువాద దృక్పథాన్ని తన కుటుంబ సభ్యులు అలవరచుకోవడానికి అవసరమైన ప్రబోధానికి ఉద్యమించాలి.

3. సమాజంలో

1) సమాజంలో ఎచ్చులొచ్చులను, కులాన్ని ప్రతిఘటించాలి.

2) స్త్రీలలో పరదా పద్ధతిని నిర్మూలనం చేయాలి.

3) పౌరులందరికీ ఒక శాసన సంహిత (Common Civi Code) ఉండేలా కృషిచేయాలి.

4) విశ్వమానవ హక్కుల ప్రణాళికకు అనుగుణంగా వివాహం, మనవర్తి, దత్తత, వారసత్వం, ఆస్తి సంక్రమణ మొదలగు వాటికి సంబంధించిన శాసనాలను రూపొందించుకోవాలి.

5) ఆరోగ్యకరమైన దాంపత్య జీవితానికి అడ్డంకులుగా ఉండే లైంగిక నిషేధాలను త్రోసిరాజనాలి.

6) సామాజిక జీవితాన్ని లౌకిక భావనతో నింపాలి.

4. ప్రభుత్వం నుండి ఆశించదగినవి.

1) మతభావనను రాజ్యం వ్యాప్తి చేయరాదు. ఏ ఒక్క మతాన్ని కూడ ప్రోత్సహించరాదు.

2) ప్రభుత్వ కార్యకలాపాల్లో ప్రార్థన, పూజ, ఆరాధన లాంటి మతపరమైన పనులకు చోటు పెట్టరాదు.

3) ప్రభుత్వముచేత నిర్వహింపబడి లేక ప్రభుత్వముచేత గుర్తింపబడి సహాయం పొందుతూ ఉన్న సంస్థలు మతాన్ని లేక మతభావనను ప్రచారం చేయటం, ఆ సంస్థల ఆస్తులను వాటికి వినియోగించడం పూజా స్థలాలుగా, ఆరాధన ప్రదేశాలుగా వాడడం నిషేధించాలి.

4) రేడియో, టెలివిజను, ప్రభుత్వ ఫిలిం శాఖలలో మత వాసనను, మత దృష్టిని తొలగించాలి.

5) పై చర్యల కవసరమైన అధికారాన్ని పొందటానికి అవసరమైన రాజ్యాంగ సవరణలను చేయాలి.

6) శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలలో పెంచి, శాస్త్రీయ భావనను విమర్శనా దృష్టిని ప్రజలలో వ్యాప్తి చెందేలా మార్గాలు అన్వేషించాలి.

7) మతపు ముసుగులో సంచరిస్తూ మోసముచేస్తూ ప్రజల కన్ను కప్పుతూ ఉండే కుహనాగురువులను, సన్యాసులను, బాబాలను నేరస్తులుగా శిక్షించాలి.

పై లక్ష్యాలను సాధించడానికి సంఘం ఈ దిగువ ఉదహరించిన పనులు చేయాలి.

1) కనీసం నెలకొకసారి ఉపన్యాసాలను, ప్రసంగాలను ఏర్పాటు చేయాలి.

2) పై ప్రసంగాల పాఠాలను ప్రచురించి ప్రజలకు అందజేయాలి.

3) హేతువాద దృష్టిగల ప్రాసంగికుల జాబితాను ఆకాశవాణికి ఇవ్వాలి.

4) హేతువాద దృష్టితో నైతిక సుభాషితాల సంపుటిని తయారు చేయించి మతం లేకుండానే మంచి జీవితం సాధ్యమని తెలియజెప్పాలి.

5) లక్ష్య సాధనకు అనువైన అన్ని కార్య కలాపాలు చేపట్టాలి.

భావవిప్లవ కవి, కవిరాజు

త్రిపురనేని రామస్వామిచౌదరి రచనలు

సూత పురాణము
కురుక్షేత్ర సంగ్రామము
శతకాలు - గీతాలు
శంబుక వధ
భగవద్గీత
వివాహ విధి
ఖూనీ

ఇంకా మావద్ద లభించు హేతువాద గ్రంథాలు

యం. యన్. రాయ్	జీవితం - సిద్ధాంతం	కోగంటి రాధాకృష్ణమూర్తి
,,	వ్యాసాలు	,,
,,	స్వీయగాథలు	బి. యస్. యల్. హనుమంతరావు
,,	ఫాసిజం	రావిపూడి వెంకటాద్రి
,,	నవ్యమానవవాదం	ఎం. వి. రామమూర్తి
,,	రాడికల్ హ్యూమనిజం	రావిపూడి వెంకటాద్రి
	మానవుడు-సమాజం-ప్రకృతి	,,
	మహామనీషి	కొల్లా సుబ్బారావు
	శాస్త్రము-విజ్ఞానము-నాగరికత	ఆర్. వి. జి. సుందరరావు

సరళా పబ్లికేషన్స్
బోస్‌రోడ్ · తెనాలి